JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | సోమవారం 06-04-2026
Medchal - Malkajgiri | Monday 06-04-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 309
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 309 | Pages : 8 | ₹: 5


7 లో

# 48 గంటల డెడ్‌లైన్



- ఇరాన్ మూసివేయడంపై డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం
- ట్రంప్ చేసిన ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కలకలం
- ఆకస్మిక చమురు కొరత ఏర్పడి అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలపై పెను ప్రభావం
- ఇరాన్ ఏమాత్రం వెనక్కి తగ్గకపోయినా, ప్రతి దాడులకు దిగినా మూడో ప్రపంచ యుద్ధం

**జయభేరి, న్యూఢిల్లీ:**

హార్ముజ్ జలసంధి మూసివేతపై డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మంగళవారం వరకు గడువు ఇచ్చాడు. వెంటనే హార్ముజ్ జలసంధిని తెరవకపోతే మంగళవారం నాటికి ఇరాన్‌లోని ప్రధాన విద్యుత్ కేంద్రాలు, వంతెనలు, కీలక మౌలిక సదుపాయాలపై భీకర దాడులు చేస్తామని ట్రంప్ డెడ్‌లైన్ విధించారు. అమెరికాఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంపై డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ పాలకులను ఉద్దేశించి చాలా కఠినమైన పదజాలంతో ఆయన సంచలన హెచ్చరికలు జారీ చేశారు. వెంటనే హార్ముజ్ జలసంధిని తెరవకపోతే మంగళవారం నాటికి ఇరాన్‌లోని ప్రధాన విద్యుత్ కేంద్రాలు, వంతెనలు, కీలక మౌలిక సదుపాయాలపై భీకర దాడులు చేస్తామని ట్రంప్ డెడ్‌లైన్ విధించారు. పిచ్చి పనులు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ...మిగతాది 2 లో



“ గచ్చిబౌలి స్టేడియంలో బిఎన్ ముల్లిక్ మెమోరియల్ ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్షిప్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్నాను. టోర్నమెంట్ విజేత సీఐఎస్ ఎఫ్ జట్టుకు ట్రోఫీని అందించి అభినందించాను. స్వయంగా ఫుట్ బాల్ ఆడి క్రీడా స్ఫూర్తిని చాటాను.

**- ముఖ్యమంత్రి రేవంత్**

# మా ప్రభుత్వం సర్వం సిద్ధం

- తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసింది
- క్రీడాకారులను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధం
- దేశం కోసం ఏమైనా చేయడానికి మనందరం సిద్ధంగా ఉండాలి
- 1956 ఒలంపిక్స్‌లో ఆడిన ఫుట్‌బాల్ జట్టులో ఏడుగురు క్రీడాకారులు హైదరాబాద్‌కు చెందిన వారే

**జయభేరి, హైదరాబాద్ :**

దేశంలోని యువత క్రీడా మైదానాలను ఎందుకు వదిలేస్తున్నారన్న అంశం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. యువతను సరైన మార్గంలో పెట్టకపోతే దేశం ప్రమాదకర పరిస్థితులను నెట్టివేయబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ గచ్చీబౌలీ స్టేడియంలో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 74వ బోలానాథ్ ముల్లిక్ స్మారక ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ 2026 ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశం నలుమూలల నుంచి వివిధ విభాగాలకు చెందిన పోలీసు క్రీడాకారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. "యువత నెమ్మదిగా క్రీడలకు దూరమవుతున్నారు. క్రీడా మైదానాలను వదిలిపెట్టి యువత తప్పు చేస్తున్నారు. దేశం కోసం ఏమైనా చేయడానికి మనందరం సిద్ధంగా ఉండాలి. యువత సరైన దశలో వెళ్లకపోతే భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుంది" అని హెచ్చరించారు. "క్రీడాకారులను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉంది. క్రీడాకారులను తయారు చేసి దేశ ప్రతిష్టను నిలబెట్టాలి. యువతను క్రీడల్లో ప్రోత్సహించండి" అని పిలుపునిచ్చారు. "భారత్ ఫుట్‌బాల్ చరిత్రలో హైదరాబాద్ నగరానికి విశేష పేరు ప్రఖ్యాతులున్నాయి. 1950, 60 దశకంలో నర్సరీ ఆఫ్ ఇండియన్ ఫుట్‌బాల్‌గా హైదరాబాద్ పేరు గడించింది. దేశంలోనే ఫుట్‌బాల్‌ను అంతగా ఆదరించింది. 1956 ఒలంపిక్స్‌లో ఆడిన ఫుట్‌బాల్ జట్టులో ఏడుగురు క్రీడాకారులు హైదరాబాద్‌కు చెందిన వారే. ఆ క్రమంలో ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ హైదరాబాద్‌లో నిర్వహించడం గర్వంగా ఉంది. ఈ క్రీడల నిర్వహణ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తెచ్చిన పోలీసు విభాగానికి మనస్ఫూర్తిగా అభినందనలు. దేశం నలుమూలల నుంచి ఈ క్రీడల్లో పాల్గొని అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శించిన టీమ్‌లకు తెలంగాణ ముఖ్యమంత్రిగా అందరికీ అభినందనలు. ...మిగతాది 2 లో

# సింగరేణిని కాపాడుకునేందుకు ఉద్యమిస్తాం


- కాంగ్రెస్ ప్రభుత్వం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఫైర్
- లిథియం రిఫైనరీ కోసం చిన్న సంస్థతో ఒప్పందంలో జరిగిన అవినీతిపై విచారణకు సిద్ధమా?
- హెచ్ఎంఎస్ చేసే ఉద్యమానికి జాగృతి తరఫున పూర్తి మద్దతు తెలుపుతున్నా


2 లో

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ జాగృతి కార్యాలయంలో తెలంగాణ జాగృతి & హెచ్ఎంఎస్ అధ్యర్యంలో నిర్వహించిన సేవ్ సింగరేణి రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, సమావేశంలో పాల్గొన్న హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఫార్వర్డ్ బ్లాక్ నేషనల్ కౌన్సిల్ మెంబర్ ప్రసాద్, సింగరేణి కార్మికులు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ..సింగరేణిని కాపాడుకునేందుకు ఉద్యమిస్తాం. కార్మికుల నియామకాలపై కాదు మీ అవినీతిపై ఎంక్వైరీ జరిపించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఫైర్. కార్మికులకు ఉద్యోగాలు ఇస్తే ఎంక్వైరీ చేస్తారా... ఆ మాటలు బంద్ పెట్టి ముందు మెడికల్ బోర్డు పెట్టండి.

# నా కోరిక తీరడం లేదు



- ప్రధాని మనసులో మాట బయటపెట్టేశారు
- అమ్మే సర్వస్వం.. ఫొటోగ్రఫీ ప్రాణం
- క్రమశిక్షణే ఆరోగ్య రహస్యం..

**జయభేరి, న్యూఢిల్లీ:**

ఆయన పక్కా రాజకీయ వ్యూహకర్త.. కోట్లాది మందిని తన ప్రసంగాలతో కట్టిపడేసే వాగ్ధాటి గల నేత.. ప్రపంచ వేదికలపై భారత కీర్తి పతాకాన్ని ఎగురవేస్తున్న ధీశాలి. ఆయనే భారత ప్రధాని నరేంద్ర మోదీ. సుదీర్ఘకాలం పాటు (8,931 రోజులు) అధికార బాధ్యతల్లో ఉండి అరుదైన రికార్డు సృష్టించిన మోదీ, తన సుదీర్ఘ ప్రస్థానంలో ఎదురైన కొన్ని ఆత్మీయ అనుభవాలను, తనలోని సామాన్యుడి కోరికలను పంచుకున్నారు. ప్రపంచ దేశాల అధినేతలతో భేటీలు, నిరంతర సమీక్షలతో బిజీగా ఉండే మోదీకి ఒక చిన్న కోరిక ఉందట. సాయంత్రం ఆరు గంటల సమయంలో, నీలాకాశం కింద ఏకాంతంగా కూర్చుని ప్రశాంతంగా ఒక కప్పు 'చాయ్' తాగాలనేది ఆయన చిరకాల వాంఛ. కానీ, దశాబ్దాలుగా సాయంత్రం పూట ఏదో ఒక అధికారిక సమావేశంలో ఉండటం వల్ల ఆ చిన్న కోరిక తీరడం లేదని ఆయన గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందు ఐదు రోజుల పాటు ఆహారం వెంట పెట్టుకుని అడవుల్లోకి వెళ్లిపోయి, ప్రకృతి ఒడిలో 'నన్ను నేను తెలుసుకోవడం' కోసం గడిపేవారట. అది తనను తాను రీఛార్జ్ చేసుకునే మార్గమని ఆయన చెబుతారు.

**ఆ పిలుపు కోసం ఎదురుచూశా..**

ముఖ్యమంత్రి అయ్యాక తన చిన్ననాటి స్నేహితులు ...మిగతాది 2 లో

# ప్రతి బొట్టును సంరక్షించుకోవాలి

- నీటి సంరక్షణ-జలవనరుల పరిరక్షణపై 100 రోజుల కార్యాచరణ ప్రకటించిన సీఎం చంద్రబాబు నాయుడు
- వేసవికి ముందు 6 మీటర్లు, వర్షాకాలం తర్వాత 3 మీటర్ల లోతున భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు



**విజయవాడ, ఏప్రిల్ 5 :**

'నీటి భద్రత అనేది ప్రభుత్వం బాధ్యతే కాదు.. ప్రజల భాగస్వామ్యమూ ఉండాలి. దీనికి సాగునీటి సంఘాలు బాధ్యత తీసుకోవాలి. ప్రతి చుక్కను ఒడిసి పట్టుకోవాలి... ప్రతి బొట్టును సంరక్షించుకోవాలి... భూగర్భ జలాలను పెంచాలి'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 'ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 15 తేదీ వరకు పనుల గుర్తింపు కార్యక్రమం చేపట్టాలి. ఏప్రిల్ 16 నుంచి 20వ తేదీ వరకు గుర్తించిన పనులకు పరిపాలనా ...మిగతాది 2 లో



# డ్రగ్స్.. కలకలం

- ఓ మోడల్.. భార్యాభర్తలు.. బిజినెస్‌మెన్.. రిసార్ట్‌లో అడ్డంగా బుక్కయిన ఆరుగురు..

**జయభేరి, హైదరాబాద్ :**

బార్ అయినా, పబ్ అయినా, రిసార్టైనా, ఫామ్‌హౌస్ అయినా.. చీర్స్ కొట్టి చిందేస్తూ, చిల్ అయితే పర్లేదు.. కానీ కొందరు డ్రగ్స్ తీసుకుని గాల్లో తేలాలి అనుకుంటున్నారు. అలాంటి బ్యాచ్‌పై ఎప్పటికప్పుడు నిఘా పెడుతున్న ఈగల్ టీమ్.. దొరికినోళ్లను దొరికినట్టు కటకటాల్లో వేస్తోంది. ఈ ఒక్క వారంలోనే ...మిగతాది 2 లో



# రూ.7000 కోట్ల భూ స్కామ్

- రేవంత్‌పై హరీష్ రావు సంచలన ఆరోపణలు

**హైదరాబాద్ :**

నాదర్‌గుల్ ప్రాంతంలోని రూ.7 వేల కోట్ల విలువైన 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ నాయకులు గద్దల్లా తన్నుకుపోతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేదల ఇళ్లు కూలగొడుతున్న ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## మా ప్రభుత్వం సర్వం సిద్ధం

140 కోట్ల జనాభా కలిగిన భారత్ ఒలింపిక్స్‌లో కనీసం ఒక్క గోల్డ్ మెడల్ కూడా సాధించలేకపోవడం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. గతంలో ఇదే గచ్చీబౌలీలో ఎన్నో క్రీడలు నిర్వహించాం. గడిచిన కొన్నేళ్లుగా పట్టించుకోలేదు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో మనవాళ్లు ఓడిపోగానే కొద్దిరోజులు చర్చించి ఆ తర్వాత విస్మరిస్తున్నారు. యువత మాదక ద్రవ్యాల వలలో పడి నిర్వీర్యమైపోతోంది. వీరుల భూమి, ఎంతోమంది త్యాగధనులకు కేంద్రమైన పంజాబ్‌లో ఈరోజు మాదకద్రవ్యాల గురించి వినిపిస్తోంది. అందుకే ఆలోచించి తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసింది. ఎంతో మంది నిష్ణాతులతో కలిసి రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ YISU ని నెలకొల్పాం. క్రీడల్లో రాణించిన వారికి అన్ని విధాలుగా ప్రోత్సహించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంటుంది. సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాలతో సమాజంలో సరికొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. పోలీసు విభాగాలకు చెందిన క్రీడాకారులు మైదానాల్లో ఎలాగైతే ప్రతిభను, స్ఫూర్తిని కనబరిచారో సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల నియంత్రణలో కూడా ప్రతిభను కనబరచాలి.." అని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా మైదానంలో మ్యాచ్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన టీమ్‌లకు ట్రోఫీలను అందించారు.

## 48 గంటల డెడ్‌లైన్

వస్తుందని ఆయన తేల్చి చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మనీ కంట్రోల్ కథనం ప్రకారం.. ట్రంప్ తన తాజా ప్రకటనలో ఇరాన్ నాయకులను తీవ్రంగా దూషించారు. "పిచ్చి పనులు మానుకుని వెంటనే ఆ హోర్ముజ్ జలసంధిని తెరవండి" అంటూ బూతు పదజాలంతో విరుచుకుపడ్డారు. మంగళవారం లోగా ఇరాన్ నుంచి సానుకూల స్పందన రాకపోతే అమెరికా యుద్ధ విమానాలు రంగంలోకి దిగుతాయని స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ విషయంలో ఇజ్రాయెల్ కూడా అమెరికాకు పూర్తి మద్దతు తెలుపుతోంది. ఇరాన్ పై ఉమ్మడిగా సైనిక చర్య చేపట్టేందుకు ఈ రెండు దేశాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం అందుతోంది. అసలు ఈ హోర్ముజ్ జలసంధి ఎందుకు అంత కీలకం అంటే.. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే ముడి చమురులో దాదాపు 20 శాతానికి పైగా ఈ సన్నని సముద్ర మార్గం గుండానే రవాణా అవుతుంది. పెర్షియన్ గల్ఫ్ నుంచి ఇతర దేశాలకు చమురు తరలించడానికి ఇది ప్రధాన ద్వారం లాంటిది. దీనిని ఇరాన్ పూర్తిగా మూసివేస్తే ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతం ఆకాశాన్ని తాకుతాయి. ఇరాన్ తీరుతో గ్లోబల్ మార్కెట్లు కుప్పకూలే ప్రమాదం ఉండటం వల్లే అమెరికా ఇంత కఠినంగా వ్యవహరిస్తోంది. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ సైన్యం కూడా అప్రమత్తమైంది. ఇరాన్ ఏమాత్రం వెనక్కి తగ్గకపోయినా, ప్రతి దాడులకు దిగినా మూడో ప్రపంచ యుద్ధం మొదలయ్యే ముప్పు ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఐక్యరాజ్యసమితితో పాటు పలు ఐరోపా దేశాలు ఈ ఉద్రిక్తతలను చల్లార్చడానికి తెరవెనుక దౌత్య ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ట్రంప్ విధించిన మంగళవారం గడువు ముగిసేలోపు ఇరాన్ తన నిర్ణయాన్ని మార్చుకుంటుందా లేక అమెరికా దాడులకు సిద్ధపడుతుందా అనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

## రూ.7000 కోట్ల భూ స్కామ్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, నాదర్‌గుల్‌లో జరుగుతున్న ఈ వేల కోట్ల కుంభకోణం, కబ్జాలు, చెరువుల ఆక్రమణలు ఎందుకు కనిపించడం లేదని తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు. ఈ భారీ కుంభకోణం వెనుక సాక్షాత్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబం హస్తం ఉందని ఆరోపించారు. హైకోర్టు తీర్పును సైతం పక్కనపెట్టి, అధికార బలంతో బౌన్సర్లను పెట్టి పేద రైతులపై దాడులు చేయిస్తున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌కు నిజమైన చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కబ్జాదారులను అరెస్ట్ చేయించి, తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న రైతులను తిరిగి భూముల్లోకి పంపాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఈ భూ వ్యవహారంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ రేపటిలోగా చర్యలు తీసుకోకపోతే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలతో కలిసి తామే స్వయంగా నాదర్‌గుల్ భూముల వద్దకు వెళ్తామని హరీష్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రౌడీలు, బౌన్సర్లు ఎప్పుడూ ఇలా పేదలపై పడలేదని, కాంగ్రెస్ రాగానే పరిస్థితి దారుణంగా తయారైందని ఆయన విమర్శించారు.

## డ్రగ్స్.. కలకలం

రోజుకొకటి చొప్పున డ్రగ్స్ కేసులు నమోదయ్యాయంటే హైదరాబాద్.. 'హైడ్రగ్స్ బాద్'గా మారిందా అనే ఆందోళన కనిపిస్తోంది. తాజాగా.. హైదరాబాద్ వీకెండ్ పార్టీల్లో విచ్చలవిడిగా డ్రగ్స్.. వినియోగం కలకలం రేపింది. హైదరాబాద్ తారామతి రిసార్ట్‌లో ఈగల్ టీమ్ దాడులు నిర్వహించింది. More Than ఫ్రెండ్స్ పేరుతో ఈవెంట్ నిర్వహించగా.. దాదాపు 600 నుంచి 800 మంది హాజరయ్యారు. పోలీస్ రైడ్ జరిగిన సమయంలో ఈవెంట్‌లో సుమారు 300 మంది ఉన్నారు. అనుమానితులు.. 36 మందికి డ్రగ్ టెస్టు నిర్వహించగా అందులో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్ గా నమోదైంది. ఆరుగురిలో ఒక మహిళ కూడా ఉన్నారు. పాజిటివ్ వచ్చినవారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. More than ఫ్రెండ్స్ పేరుతో జరిగిన ఈవెంట్‌లో విచ్చలవిడిగా డ్రగ్స్, మద్యం సేవించినట్లు కనిపిస్తోంది. ఈ ప్రాంతంలో బీర్, వోడ్కా, విస్కీ బాటిల్స్ ఎక్కడికక్కడ విచ్చలవిడిగా పడి ఉన్నాయి.

**దొరికిన వారిలో భార్యాభర్తలు, మోడల్..**

నిన్న రాత్రి రాత్రి డ్రగ్స్ తీసుకుని దొరికిన ఆరుగురిని అదుపులోకి తీసుకోగా.. అందులో ఓ మహిళ కూడా ఉంది. అయితే.. భార్యాభర్తలే మాదకద్రవ్యాలు తీసుకుని దొరకడం పోలీసుల్నే షాక్‌కి గురి చేసింది. డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన ఆరుగురిని ఈగల్ టీమ్ ప్రశ్నిస్తోంది. DJ ప్లేయర్ కమ్ ఈవెంట్ ఆర్గనైజర్ జాసన్‌కి డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. ఓ మోడల్‌తోపాటు మరో వ్యాపారవేత్త, ఒడిశా వ్యక్తి అరెస్ట్ అయినట్లు పోలీసులు తెలిపారు. ఈ పార్టీపై నిఘా పెట్టిన ఈగల్ టీమ్ అనుమానం వచ్చిన వాళ్లకు టెస్ట్‌లు చేయడం, ఆ వెంటనే అదుపులోకి తీసుకుని విచారించడం చకచకా జరిగిపోయాయి.

## నా కోరిక తీరడం లేదు

35 మందిని పిలిచి విందు ఇచ్చిన సందర్భాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. తాను ఏ హోదాలో ఉన్నా పాత స్నేహితుడినే అని వారికి అనిపించాలని ఆశపడ్డారు. కానీ, వచ్చిన వారంతా ఆయన్ని 'ముఖ్యమంత్రి' అని గౌరవంగా పిలిచారే తప్ప, ఒక్కరు కూడా పాత చనువుతో 'నువ్వు' అని పిలవలేదు. ఆ గౌరవప్రదమైన దూరం తనను కొంత బాధించిందని ఆయన ఆవేదన చెందారు.

**అమ్మే సర్వస్వం.. ఫోటోగ్రఫీ ప్రాణం!**

మోదీకి ప్రకృతి అన్నా, వన్యప్రాణులన్నా అమితమైన ఇష్టం. ముఖ్యంగా ఫోటోగ్రఫీ పట్ల ఆయనకు మంచి ఆసక్తి ఉంది. కెమెరా లెన్సులు, లైటింగ్, ఫ్రేమింగ్ వంటి సాంకేతిక విషయాలపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. ఇక తన తల్లి హీరాబెన్ గురించి చెబుతూ.. శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌లో జెండా ఎగురవేసి క్షేమంగా ఉన్నానని చెప్పడానికి మొదట ఫోన్ చేసింది అమ్మకేనని గుర్తుచేసుకున్నారు. సన్యాసం తీసుకోవాలని ఒకప్పుడు భావించినా, వివేకానందుడి స్ఫూర్తితో ప్రజాసేవ వైపు అడుగులు వేశానని చెప్పారు.

**క్రమశిక్షణే ఆరోగ్య రహస్యం..**

మోదీ ఆరోగ్య రహస్యం ఆయన పాటించే కఠినమైన ఆహార నియమాలు. 50 ఏళ్లుగా నవరాత్రుల్లో కేవలం వేడి నీళ్లే తాగుతారు. మంచం ఎక్కిన 30 సెకన్లలోనే గాఢ నిద్రలోకి జారుకోవడం ఆయన ప్రత్యేకత. యోగా, ధ్యానంతో పాటు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్లే నిత్యం చురుగ్గా ఉండగలుగుతున్నానని ఆయన వివరించారు. ప్రత్యర్థి అయినా మమతా బెనర్జీని 'దీదీ'గా భావించి, ఆమె పంపే కుర్తాలు, మిఠాయిలను స్వీకరించడం ఆయనలోని మానవీయ కోణానికి నిదర్శనం. సమాజానికి సందేశమిచ్చే సినిమాలన్నా, కవిత్వం రాయడమన్నా మక్కువ చూపే మోదీ.. ఒక సాధారణ కార్యకర్త నుంచి విశ్వనాయకుడిగా ఎదిగినా, తనలోని సామాన్యుడిని ఇంకా సజీవంగానే ఉంచుకున్నారు.

# డిజిటల్ రూపాయి అంటే ఏమిటి?
# యూపీఐకి, దీనికి తేడా ఏంటి?




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిటల్ రూపీ ఏమిటి? యూపీఐ, క్రిప్టోకి ఈ డిజిటల్ రూపాయికి తేడా ఏంటి? పైలట్ ప్రాజెక్టులో ఏ బ్యాంకులు పాల్గొనబోతున్నాయి? గత కొంత కాలంగా డిజిటల్ రూపీ గురించి ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్న ప్రశ్నలివి. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలను వివరంగా తెలుసుకునేందుకు ప్రయత్నిద్దాం.. వాస్తవంగా.. డిజిటల్ చెల్లింపు వ్యవస్థను విస్తరించాలనే లక్ష్యంతో, కస్టమర్లకు లావాదేవీలను సులభతరం చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫ్‌లైన్ డిజిటల్ రూపీని (e₹) లాంచ్ చేసింది. రిజర్వ్ బ్యాంక్ ప్రకారం.. డిజిటల్ రూపీ లేదా e₹ అనేది భారత కేంద్ర బ్యాంకుకు చెందిన డిజిటల్ కరెన్సీ (సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ సీబీడీసీ).

**డిజిటల్ రూపీ అంటే ఏమిటి?**

డిజిటల్ రూపీ లేదా e₹ అనేది భారత భౌతిక కరెన్సీ రూపాయికి డిజిటల్ రూపం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) దీన్ని డిజిటల్‌గా జారీ చేస్తుంది. చేతిలో నగదు తరహాలోనే ఇది కూడా పనిచేస్తుంది. నగదుకుండే విలువే దీనికీ ఉంటుంది. రిజర్వ్ బ్యాంక్ దీనికి గ్యారెంటీగా ఉంటుంది. మీరు దీన్ని మీ ఫోన్‌లోని డిజిటల్ వాలెట్‌లో ఉంచుకోవచ్చు. సాధారణ రూపాయి నోటును ఉపయోగించిన మాదిరిగానే, దీన్ని ఉపయోగించి డబ్బులు పంపవచ్చు, స్వీకరించవచ్చు, చెల్లింపులు కూడా చేయవచ్చు. డిజిటల్ రూపీ లావాదేవీల కోసం, పైలట్ ప్రాజెక్టులో పాల్గొంటున్న బ్యాంకులు అందించే డిజిటల్ వాలెట్లను కస్టమర్లు వాడుకోవచ్చు.

**డిజిటల్ రూపీని ఎవరు జారీ చేస్తారు?**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిటల్ రూపీని జారీ చేస్తుంది. పేపర్ కరెన్సీ మాదిరిగానే దీని చెలామణిని కూడా బ్యాంకులు నిర్వహిస్తాయి. డిజిటల్ రూపీని రిజర్వ్ బ్యాంకే సృష్టిస్తుంది. బ్యాంకులకు, అధీకృత బ్యాంకింగేతర సంస్థలకు ఎలక్ట్రానిక్ రూపంలో ఆర్‌బీఐ పంపిస్తుంది. ఆ తర్వాత, మొబైల్ ఫోన్లలో డిజిటల్ రూపీ వాలెట్ల ద్వారా ఆయా బ్యాంకులు లేదా బ్యాంకింగేతర సంస్థల ఖాతాదారులు ఈ డిజిటల్ నగదును వాడుకోవచ్చు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన బ్యాంకులు, బ్యాంకింగేతర సంస్థలకు చెందిన ఖాతాదారులు, వ్యాపారులు దీన్ని వాడుకోవచ్చు.

**డిజిటల్ రూపీని ఎలా నిల్వ చేసుకోవచ్చు, ఎలా వాడుకోవచ్చు?**

బ్యాంకులు, అధీకృత బ్యాంకింగేతర సంస్థలు అందించే డిజిటల్ వాలెట్లలో డిజిటల్ రూపీని నిల్వ చేసుకోవచ్చు, వాడుకోవచ్చు. ఈ వాలెట్లు నేరుగా వ్యక్తులకు లేదా వ్యాపారులకు చెల్లింపులు చేసుకునేలా సహకరిస్తాయి. డిజిటల్ రూపీ వాడటం ప్రారంభించేందుకు, ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్ నుంచి డిజిటల్ రూపీ వాలెట్ (e₹ Wallet) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, యాప్‌లోని సూచనలను పాటించాలి. మరింత సమాచారం కోసం మీ బ్యాంకును లేదా వాలెట్ ప్రొవైడర్‌ను కూడా సంప్రదించవచ్చు. చెల్లింపులు చేసేందుకు, స్టోర్‌లో అందుబాటులో ఉన్న సీబీడీసీ క్యూఆర్ కోడ్‌ను లేదా యూపీఐ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా దుకాణదారుడికి మీరు చెల్లింపులు చేయొచ్చు. అయితే, డిజిటల్ రూపీ వాడేందుకు పొదుపు ఖాతా తప్పనిసరిగా అవసరమా? అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. ప్రస్తుతం, డిజిటల్ రూపీ వాలెట్‌ను ఖాతాదారుల పొదుపు ఖాతాకు అనుసంధానించడం ద్వారా తెరుస్తారు. దీనివల్ల ఖాతాదారుని ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ సులభతరం కావడమే కాకుండా, ప్రత్యేకంగా కేవైసీ చేయాల్సిన అవసరం కూడా ఉండదు.

ఆర్‌బీఐ వెబ్‌సైట్ ప్రకారం.. ''వాడుకలో ఎదురయ్యే సమస్యలు, ఫీడ్‌బ్యాక్‌ను అనుసరించి, ఖాతాదారుల ఆన్‌బోర్డింగ్ కోసం సరికొత్త మోడల్స్‌ను పరిశీలించనున్నాం'' అని ఆర్‌బీఐ వెబ్‌సైట్ తెలిపింది.

డిజిటల్ రూపీ ప్రస్తుతం పైలట్ దశలో ఉన్నందున.. కేవలం ఎంపిక చేసిన బ్యాంకులు, ఆథరైజ్డ్ బ్యాంకింగేతర సంస్థలకు చెందిన కస్టమర్లు, వ్యాపారులు మాత్రమే దీన్ని వాడుకోగలరు. దీని కోసం, మీరు e₹ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి, దానిలో రిజిస్టర్ అవ్వాలి. ఆ తర్వాత వాలెట్‌ను వాడటం మొదలు పెట్టవచ్చు.

**యూపీఐకి, దీనికి తేడా ఏంటంటే..**

డిజిటల్ రూపీ అనేది యూపీఐ లావాదేవీల మాదిరిగానే అనిపించినప్పటికీ, ఈ రెండింటి మధ్య అనేక తేడాలు ఉన్నాయి. యూపీఐ లేదా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ అనేది ఒక చెల్లింపు విధానం. అది దానికది డబ్బు కాదు. ఒక బ్యాంకు అకౌంట్ నుంచి మరో బ్యాంకు అకౌంట్‌కు డబ్బులను బదిలీ చేసుకునేందుకు ఇది అనుమతి ఇస్తుంది. సరళంగా చెప్పాలంటే.. యూపీఐ అనేది రెండు బ్యాంకు అకౌంట్ల మధ్య డబ్బులను బదిలీ చేసుకునేందుకు వీలు కల్పించే వ్యవస్థ. అయితే, డిజిటల్ రూపీ అనేది స్వయానా డబ్బు. ఇది డిజిటల్ రూపంలో ఉంటుందంతే. యూపీఐ వాడుతూ మీరు చెల్లింపులు చేసినప్పుడు, మీ బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బులు డిడక్ట్ అవుతాయి. కానీ, మీరు డిజిటల్ రూపీని ఉపయోగించినప్పుడు, నగదు నోట్లను ఉపయోగించినట్లే మీ వాలెట్‌లో ఉన్న డిజిటల్ నగదును బదిలీ చేస్తారు. అంతేకాకుండా, యూపీఐ లావాదేవీలకు బ్యాంకుల పాత్ర ఎంతో అవసరం. కానీ, డిజిటల్ రూపాయి లావాదేవీలు చేతిలో నగదు మాదిరిగా, నేరుగా ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి పంపుకోవచ్చు. భవిష్యత్తులో ఆఫ్‌లైన్ లావాదేవీలు కూడా అందుబాటులోకి రావొచ్చు.

**డిజిటల్ రూపీ - క్రిప్టో కరెన్సీకి తేడా?**

బిట్‌కాయిన్ లేదా ఇతర క్రిప్టో కరెన్సీలను కేంద్ర బ్యాంకు నియంత్రించడం లేదు. అయితే, డిజిటల్ రూపీని రిజర్వ్ బ్యాంక్ నియంత్రిస్తూ, జారీ చేస్తుంది. డిజిటల్ రూపీ చట్టబద్ధంగా చెలామణిలో ఉంది. అయితే, క్రిప్టోకరెన్సీకి భారత్‌లో చట్టబద్ధమైన చెలామణి హోదా లేదు. ప్రస్తుతం సీబీడీసీ ఎకోసిస్టమ్‌లో 19 బ్యాంకులు భాగమై, డిజిటల్ రూపీ వాలెట్లను అందిస్తున్నాయి. ఆ బ్యాంకుల్లో.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యెస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, కర్ణాటక బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్ ఉన్నాయి. ఈ బ్యాంకులు మొబైల్ యాప్‌ల ద్వారా సీబీడీసీ వాలెట్లను అందిస్తున్నాయి. ఈ వాలెట్లు డిజిటల్ రూపీని స్టోర్ చేసుకునేందుకు, లావాదేవీలు జరిపేందుకు ఖాతాదారులకు అనుమతి ఇస్తున్నాయి. ప్రస్తుతం డిజిటల్ రూపీ ప్రతి ఒక్కరికీ అందుబాటులో లేదు. ఇది ఆర్‌బీఐ నియంత్రణలో పైలట్ దశలో ఉంది. మీరు ఈ సేవలు అందిస్తున్న బ్యాంకు కస్టమర్ అయితేనే, ఈ పైలట్ ప్రాజెక్టులో భాగం కావొచ్చు. బ్యాంకులు కూడా ఎంపిక చేసిన యూజర్లను ఆహ్వానించి, క్రమంగా ప్రతిఒక్కరికీ అందుబాటులోకి తేవొచ్చు. దీనికోసం మీరు బ్యాంక్ సీబీడీసీ వాలెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. కేవైసీ పూర్తి చేసి, రిజిస్టర్ కావాలి. మీ బ్యాంకు అకౌంట్‌ను లింక్ చేసుకుని, వాలెట్‌లో డిజిటల్ రూపీని లోడ్ చేసుకోవాలి.

**నగదును డిజిటల్ రూపీ భర్తీ చేయగలదా?**

డిజిటల్ రూపీని తీసుకొచ్చిన ఉద్దేశం కరెన్సీ ప్రస్తుత రూపాలను తీసివేయడం కాదని, వాటికి అనుబంధంగా ఉంచడమేనని రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేసింది.

భారత్ ముఖ్యంగా గ్రామీణ, అసంఘటిత రంగాలు ఎక్కువగా నగదుపై ఆధారపడ్డాయి. నగదుపై ఉన్న నమ్మకాన్ని నిలబెడుతూనే డిజిటల్ చెల్లింపులను సులభతరం చేస్తుంది డిజిటల్ రూపీ. ఇది నగదు నిర్వహణ ఖర్చులను తగ్గించడానికి, లావాదేవీల సామర్థ్యాన్ని పెంచడానికి, భవిష్యత్తులో ఆఫ్‌లైన్ డిజిటల్ చెల్లింపులను సాధ్యం చేయడానికి సహాయపడుతుంది.

## సింగరేణిని కాపాడుకునేందుకు ఉద్యమిస్తాం

కార్మికుల వారసులకు డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలనేది అప్ప ప్రభుత్వ పాలసీ. రాజస్థాన్ లో సోలార్ ఒప్పందం, లిథియం రిఫైనరీ కోసం చిన్న సంస్థతో ఒప్పందంలో జరిగిన అవినీతిపై విచారణకు సిద్ధమా? సింగరేణికి ప్రభుత్వం బాకీ ఉన్న రూ.47 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలి. సింగరేణిని కాపాడుకునేందుకు మరో ఉద్యమానికి సిద్ధమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. డిపెండెంట్ కార్మికుల నియామకాలపై విజిలెన్స్, ఏసీబీ విచారణ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అనడం విడ్డూరంగా ఉందని మండి పడ్డారు. కార్మికుల నియామకాలపై కాదు మీ ప్రభుత్వ అవినీతిపై విచారణకు సిద్ధమా అని సవాల్ చేశారు. ఏ దేశంలోనైనా, ఏ రాష్ట్రం లోనైనా సహజ వనరులను అక్కడి ప్రజలకు ఉపయోగపడే విధంగా వాడేందుకు ప్రయత్నం చేస్తారు. ప్రకృతి మనకు బొగ్గు వరంగా ఇచ్చింది. దీన్ని ప్రజలకు మేలు చేసే విధంగా వాడేలా ప్రభుత్వం ఉండాలి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఉండేవో...ఇప్పుడు అలాగే పరిస్థితులు ఉన్నాయి. అప్పుడు మన తెలంగాణ వాళ్లు దుబాయి, బొంబాయి, బొగ్గు బాయి అంటూ వెళ్లేవారు. మనకు తినటానికి తిండి లేని సమయంలో కార్మికులకు తిండి పెట్టిన సింగరేణిని మనం సిరులవేణి అని తలుచుకుంటాం. ఇప్పుడున్న ప్రభుత్వానికి సింగరేణితో ఎలాంటి భావోద్వేగం లేదు. అందుకే కార్మికుల సమస్యలు వారికి తెలియటం లేదు. సింగరేణి లో నుంచి బొగ్గు తీసేందుకు కార్మికులు ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు. అక్కడి గాలి పీల్చుకుంటే ఊపిరితిత్తుల్లోకి వెళ్లి బ్లాక్ అవుతుంది. కాళ్లు వంకర అయ్యే పరిస్థితి ఉంటుంది. కాలే కడుపుతో పోయి కాలే బొగ్గు తీసుకొచ్చే వాళ్లు మన కార్మికులు. ఈ విషయం ఏమాత్రం తెలియని ప్రభుత్వం ఇప్పుడు అధికారంలో ఉండటంతో వారికి మన కష్టాలు తెలియటం లేదు. తెలంగాణ సాధించుకున్న తర్వాత మనం కొంతమందికి డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చుకున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో నష్టపోయాం. అందుకే కొన్ని సడలింపులు ఇచ్చుకొని 20 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చుకున్నాం. దీంతో ఒక 20 వేల మంది భద్రతతో బతుకుతున్నారు. ఇప్పుడు వాళ్ల మీద ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కన్ను పడింది. ఈ ఉద్యోగాలు ఎలా ఇచ్చారన్న దానిపై ఎంక్వైయిరీ వేస్తారంట? వాళ్లకు ఉద్యోగాలు ఎందుకు ఇచ్చామన్న కారణం డిప్యూటీ సీఎం భట్టి తెలుసుకోవటం లేదు. ఆనాటి గవర్నమెంట్ పాలసీ అది. దానిపై ఎలా ఎంక్వైరీ చేస్తారు? సింగరేణి తో పెట్టుకున్న ఏ నాయకుడు కూడా బాగుపడలేదు. సింగరేణి కార్మికులతో పెట్టుకోవద్దని భట్టిని నేను హెచ్చరిస్తున్నా. ఓబీ కాంట్రాక్టులు, డీజిల్ కుంభకోణాలు, కరెప్ట్ నాయకులు, అధికారుల మీద ముందు ఎంక్వైయిరీ వేయండి. కష్టపడి చెమటోడ్చే కార్మికుల మీద ఎంక్వైయిరీలు వేయటం ఏంటీ? సింగరేణి బొగ్గు మింగి అవినీతికి పాల్పడిన వాళ్ల మీద విచారణ జరపాలి. భట్టి మీద నాకు కొంచెం గౌరవం ఉండేది. కానీ సింగరేణి కార్మికుల మీద మొన్న అసెంబ్లీలో ఆయన మాట్లాడిన మాటలు విన్నాక చాలా బాధ అనిపించింది. ఆయన కార్మికుల గురించి మాట్లాడిన అంశాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా. కార్మికుల మీద ఎంక్వైయిరీ వేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నా. డీజిల్ కుంభకోణం ద్వారా 250 కోట్లు, నిబంధనల ఉల్లంఘన కారణంగా 74 కోట్లు, లీకేజీ ల కారణంగా 24 కోట్లు, అదనపు వసూళ్లు చేయలేక 1078 కోట్లు సంస్థకు నష్టం చేశారు. ఇది నేను కాదు, కాగ్ చెబుతున్న రిపోర్ట్. దీని మీద ముందు ఎంక్వైయిరీ వేయాలి. మీ చేతగాని తనంతో సింగరేణికి నష్టం చేస్తున్నారు. కార్మికులు సంస్థను కాపాడుతున్నారు. కిషన్ రెడ్డి వెళ్లి మాట్లాడగానే సంస్థలో బొగ్గు ప్రొడక్షన్ మారుతుంది. చెమట చిందించి లాభాలు తెస్తున్న కార్మికులకు లాభాల్లో వాటా ఇస్తే అభ్యంతరం ఏంటీ? స్వయంప్రతిపత్తి కలిగిన సింగరేణికి.. ప్రభుత్వం పెట్టే రూల్స్ అప్లయ్ కావు. బొగ్గు, కరెంట్ బకాయిలు కలిపి సింగరేణికి ఈ ప్రభుత్వం 47 వేల కోట్లు చెల్లించాల్సి ఉంది. వాటిని చెల్లించకపోవటంతో కార్మికుల సేఫ్టీకి, వారి జీతాలకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాజస్థాన్ తో సోలార్ ఒప్పందం, అదే విధంగా చిన్న కంపెనీతో లిథియం రిఫైనరీ అంటూ ఒప్పందం కుదుర్చుకున్నారు. సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలు యువ కార్మికులకు కూడా తెలియాలి. లిథియం రిఫైనరీ కోసం అల్ట్ మిన్ అనే చిన్న సంస్థతో సింగరేణి 2250 కోట్ల ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థను 2023లో ఏర్పాటు చేశారు. ఆ సంస్థ మొత్తం ఆదాయం రూ. 27 లక్షలు మాత్రమే. అలాంటి చిన్న కంపెనీతో సింగరేణి 2250 కోట్ల ఒప్పందం ఎలా చేసుకుంటుంది? సింగరేణి విషయంలో సిన్సియార్ ఉంటే ముందు ఈ ఒప్పందాల విషయం చెప్పండి? అల్ట్ మిన్ కంపెనీ విషయంలో బ్యాంక్ గ్యారంటీలు ఎవరివీ? సింగరేణి వాటా ఎంత? ఆ సంస్థను ఎందుకు పార్ట్ నర్ గా చేశారు? ప్రపంచ వ్యాప్తంగా లిథియం రిఫైనరీలు పెట్టిన పెద్ద సంస్థలే నష్టాల్లో ఉన్నాయి. అలాంటి ఊరు, పేరు లేని సంస్థతో ఈ ఒప్పందం ఎందుకు చేసుకున్నారు. రాజస్థాన్ తో 11 వేల కోట్ల ఒప్పందంలో సింగరేణి వాటా 72 వేల కోట్లు అంటున్నారు. ఒక మెగావాట్ ఉత్పత్తికి అయ్యే దాని కన్నా మూడు రెట్లు ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. అవుట్ రైట్ గా ఈ ఒప్పందంలో అవినీతి జరిగింది. దీనిపై మేము లెటర్ రాస్తాం. ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న వారి పేర్లు, అవినీతి బయట పెట్టాలి. మెడికల్ బోర్డు ను పాత పద్ధతిలో నిర్వహించాలి. గతంలో మెడికల్ బోర్డు పెట్టి మళ్లీ నిర్వహించటం లేదు. విజిలెన్స్ కేసుల విచారణను పూర్తి చేయాలి. ఇన్ కం ట్యాక్స్ సింగరేణి కార్మికులు ఉద్యోగులకు ఉండొద్దు. దీనిపై నేను పార్లమెంట్ లో 2015 లోనే మాట్లాడాను. ఇన్ కం ట్యాక్స్ మినహాయింపులు ఇస్తే 12 వేల నుంచి 80 వేల వరకు ఉద్యోగులకు, కార్మికులకు మేలు జరుగుతుంది. ఇది లైఫ్ రిస్క్ సెక్టార్ కావటంతోనే ఇన్ కం ట్యాక్స్ మినహాయింపు అడుగుతున్నాం. వైద్య పరీక్షల్లో పాసైన 350 మంది అభ్యర్థులకు పోస్టులు ఇవ్వాలి. ఖాళీగా ఉన్న క్లర్క్ పోస్టులను నింపాలి. సంస్థకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలి. అలియాస్ పేర్ల విషయంలో గతంలో ఉన్న విధంగానే నిబంధనలు ఉండాలి. హెల్త్ విషయంలో నిమ్స్ రేట్లను కాకుండా కేంద్రానికి సంబంధించి సీజీహెచ్ఎంస్ రేట్లు అప్లయ్ చేయాలి. సింగరేణి విముక్తి కోసం అవసరమైతే మరో తెలంగాణ ఉద్యమం మాదిరి ఉద్యమం చేస్తాం. హెచ్ఎంఎస్ చేసే ఉద్యమానికి జాగృతి తరఫున పూర్తి మద్దతు తెలుపుతున్నా.

## ప్రతి బొట్టును సంరక్షించుకోవాలి

అనుమతులు ఇవ్వాలి'అని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నీటి భద్రతసాగునీటి సంఘాల బాధ్యత పేరుతో 100 రోజుల కార్యాచరణ ప్రకటించారు. ఏప్రిల్ 6 నుంచి జూలై వరకు సాగుతుంది అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'ఏప్రిల్ 21 నుంచి జూలై 9వ తేదీ వరకు పనులను చేపట్టాలి. జూలై 10 నుంచి 14 జూలై పూర్తి చేసిన పనులకు సంబంధించిన నివేదికలను సమర్పించాలి. 100 రోజుల్లో ఈ పనులు చేపట్టాలి.. ఆ తర్వాత వర్షాలు పడతాయి'అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు. 'భూగర్భజలాలనూ సంరక్షించుకోవాలి. నీటి భద్రత చేపట్టాలి. రిజర్వాయర్లల్లో నిండుగా నీళ్లున్నాయి...గతానికంటే భూగర్భజలాలు పెరిగాయి. వాటర్ సెక్యూర్టీ ఇవ్వగలిగితే.. మిగిలిన రంగాల్లో అభివృద్ధి ఆటోమేటిగ్గా జరుగుతుంది'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలియజేశారు. 'తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు నీళ్లు అందించేలా ప్రణాళికలు సిద్దం చేసుకోవాలి. వేసవికి ముందు 6 మీటర్లు, వర్షాకాలం తర్వాత 3 మీటర్ల లోతున భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి. నీటిని నిల్వ చేయాలి.. పొదుపు చేయాలి... మైక్రో ఇరిగేషన్ అమలు చేయాలి.. ప్రతి చుక్కను సమర్థంగా వినియోగించుకోవాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 8.7 మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉన్నాయి. కనీసం 1.5 మీటర్ల మేర గ్రౌండ్ వాటర్ పెంచాలి'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

'జలధార అని పేరు పెట్టి అన్నమయ్య జిల్లా నీటి భద్రత, సంరక్షణ చర్యలను అద్భుతంగా చేపట్టింది. భూగర్భ జలాలను పెద్ద ఎత్తున పెంచారు. స్థానికంగా ఉన్న జలవనరులను వినియోగించుకున్నారు... అన్ని చెరువులను నింపారు... భూగర్భ జలాలు పెంచారు' అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'అన్నమయ్య జిల్లా స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. ఫీడర్ ఛానెళ్లను క్లియర్ చేయాలి.. పూడిక తీత పనులు చేపట్టాలి. గుర్రపు డెక్క తొలగించాలి... చెరువులు, కాల్వలను క్లియర్ చేయాలి. అప్పుడే ఎక్కువ నీటిని సంరక్షించుకోవచ్చు... ముంపును అరికట్టవచ్చు. అవసరమైన మేరకు చెక్ డ్యాంలను రిపేర్లు చేయాలి.. కొత్త స్ట్రక్చర్లు నిర్మాణం చేపట్టాలి. భూగర్భజలాలు మరీ తక్కువగా ఉన్న చోట ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. సాగునీటి సంఘాలు వాటర్ బడ్జెట్ తయారు చేసుకోవాలి'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 'ఆయా సాగునీటి సంఘాల పరిధిలో నీటి లభ్యత ఏ మేరకు ఉందో అంచనా వేసుకోవాలి... ఎంత డిమాండ్ ఉందో లెక్కలు వేసుకోవాలి. మైక్రో ఇరిగేషన్ పెంచాలి... వృధాగా నీరు పోకుండా చూడాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. '100 రోజుల్లో మిషన్ అప్రోచ్ తో పని చేయాలి... మన భవిష్యత్ మన చేతుల్లోనే ఉంది. కొద్దిపాటి శ్రద్ధగా పెడితే నీటి సమస్య లేకుండా చేయవచ్చు... కరవు రహిత రాష్ట్రంగా మార్చవచ్చు. ఒకప్పుడు రాయలసీమ ఎడారి అవుతుందన్నారు... ఇప్పుడు హార్టీకల్చర్ హబ్. పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్యత వారీగా చేపడుతున్నాం. హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగు గంగ వంటి ప్రాజెక్టులను ఎన్టీఆర్ హయాంలో చేపట్టాం'అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. 'ఇప్పుడు పోలవరం సహా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేస్తూ నదీ జలాలను సద్వినియోగం చేసుకుంటున్నాం.

# థ్యాంక్యూ రేవంతన్నా..!

**కాప్రా సర్కిల్‌కు మరోసారి భారీగా నిధుల మంజూరు..!**

**కాలనీల సంక్షేమ సంఘాలకు నిధుల మంజూరు పత్రాలను అందచేత**

**ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి**



**ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో భారీగా నిధులు మంజూరు అయ్యాయని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గానికి నిధుల మంజూరు పరంపర కొనసాగుతూనే ఉందన్నారు. ఆదివారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి కాప్రా సర్కిల్‌లోని వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులకు నిధుల మంజూరు పత్రాలను అందచేశారు. నిధుల మంజూరుకు ప్రత్యేకంగా సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి, ఇతర మంత్రులకు, ప్రభుత్వ పెద్దలకు ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మీర్‌పేట్ హెచ్‌బీకాలనీలో తిరుమలనగర్, భక్సిగూడలలో కమ్యూనిటీహాల్స్ రిపేర్స్ కోసం రూ.80 లక్షల నిధులు మంజూరు. మల్లాపూర్ డివిజన్‌లోని నెహ్రూనగర్‌లో బ్లాక్1, 2, 3లలో కమ్యూనిటీహాల్స్ రిపేర్స్ కోసం రూ.80 లక్షల నిధుల మంజూరు. మల్లాపూర్ డివిజన్ గోఖుల్‌నగర్‌లో కమ్యూనిటీహాల్ పెండింగ్ పనుల కోసం రూ.24 లక్షల నిధులు మంజూరు. మీర్‌పేట్ హెబీకాలనీ డివిజన్‌లో కృష్ణానగర్‌లో సీనియర్ సిటిజన్ భవనం పెండింగ్ పనుల కోసం రూ.20 లక్షల నిధులు మంజూరు. మల్లాపూర్ డివిజన్ సూర్యనగర్ కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనుల కోసం రూ.22 లక్షల నిధులు మంజూరు. మల్లాపూర్ డివిజన్ ఓల్డ్ మల్లాపూర్ లో అంబేద్కర్ భవన్ పెండింగ్ పనులకోసం రూ.26లక్షల నిధులు మంజూరు. మీర్‌పేట్ హెబీకాలనీ డివిజన్‌లో కృష్ణానగర్, తిరుమలనగర్‌లలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.26.50 లక్షల నిధులు మంజూరు. కాప్రా డివిజన్‌లోని భాస్కర్‌రావునగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.20 లక్షల నిధులు మంజూరు. కాప్రా డివిజన్‌లోని శ్రీనివాస్ ఆఫీసర్స్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.20 లక్షల నిధులు మంజూరు. కాప్రా డివిజన్‌లోని గాంధీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.20 లక్షల నిధులు మంజూరు. నాచారం డివిజన్‌లోని హెచ్‌ఎంటీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.40 లక్షల నిధులు మంజూరు. కాప్రా డివిజన్‌లోని గోపాల్‌రెడ్డి నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.20 లక్షల నిధుల మంజూరు. నాచారం డివిజన్‌లోని భవానినగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.40 లక్షల నిధులు మంజూరు. మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.25.50 లక్షల నిధులు మంజూరు. ఈ కార్యక్రమంలో కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## కండువా వేసి పార్టీలోకి ఆహ్వానం

**మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి**

**మేడ్చల్ :**

బోయినపల్లి క్యాంపు కార్యాలయంలో మేడ్చల్ నియోజకవర్గం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన దాదాపు 50మంది కాంగ్రెస్ కార్యకర్తలు యువకులు పార్టీ నాయకులు ఆలూరి రాజశేఖర్, ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీని వీడి భారత రాష్ట్ర సమితి పార్టీలో చేరడం జరిగింది. నీకేతన్ గౌడ్, శ్రీకాంత్, రూపేష్, హరి, సన్నీ నరేంద్ర, వినోద్, ఈశ్వర్, దినేష్, తదితరులు పార్టీలో చేరడం జరిగింది. వీరందరికి గులాబీ కండువా వేసి BRS పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ కావ్య, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ BRS పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, పార్టీ యూత్ జర్నల్ సెక్రటరీ దిలీప్, నాయకులు రెడ్డి శెట్టి మహేష్, రంగుల సతీష్, జన లక్ష్మి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ

**సీనియర్ జర్నలిస్టు లయన్ మేకల మల్లేశం సహకారంతో గొడుగుల పంపిణీ**




**మేడిపల్లి, ఏప్రిల్ 05 :**

ఉప్పల్ బస్ డిపో వద్ద మండుటెండలో రోడ్ల పైన పండ్లు అమ్ముకునే చిరు వ్యాపారులు, చెప్పులు కొట్టుకునే వారికి మేడిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారము గొడుగులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లయన్స్ క్లబ్ సభ్యులు సీనియర్ జర్నలిస్టు లయన్ మేకల మల్లేశం సహకారంతో పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు లయన్ వేముల కేశవనాదం గౌడ్, లయన్ బిక్షపతి,లయన్ దుర్గ, లయన్ నరసింహాచారి, లయన్ సందీప్, లయన్ బాలరాజు గౌడ్, మేడిపల్లి క్లబ్ ఎక్స్టెన్షన్ చైర్‌పర్సన్ లయన్ అశోక్, లయన్ శారద పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు.

## సామాజిక న్యాయం కోసం..
## బరిగీసి కొట్లాడిన బాబు జగ్జీవన్ రామ్



**యాదగిరిగుట్ట, ఏప్రిల్ 05:**

సామాజిక న్యాయం కోసం జరిగిసి కొట్లాడిన జగమెరిగిన జననేత బాబు జగ్జీవన్ రామ్ అంటూ యాదగిరిగుట్ట పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఆయన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**భారతరత్న ఇవ్వాలి**

సామాజిక న్యాయం కోసం జరిగిసి కొట్లాడిన జగమెరిగిన జన నేత బాబు జగ్జీవన్ రామ్ అని, ఆ మహనీయునికి భారతరత్న బిరుదు ఇవ్వటం సముచితం అని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద శంకర్ మాదిగ, యాదగిరిగుట్ట మున్సిపల్ 2వ వార్డ్ కౌన్సిలర్ బూడిద మధు, మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం వారి అభ్యున్నతి కోసం బాబు జగ్జీవన్ రామ్ ఎన్నో సేవలు చేశారని ఈ దేశంలో అనేక సంస్కర ణలకు నాంది పలికారని శాసనసభ్యుడిగా, మంత్రిగా,కేంద్రమంత్రిగా 50 ఏళ్ల పాటు ప్రజా ప్రతినిధిగా అనేక శాఖలకు మంత్రిగా పనిచేసి ప్రతీ శాఖకు వన్నె తెచ్చిన గొప్ప రాజనీతిజ్ఞుడు అని కొనియాడారు. అట్టడుగు వర్గాల్లో పుట్టి దేశ ప్రధాన మంత్రి పదవిని అలంకరించాల్సిన వ్యక్తి ఉపప్రధానిగానే మిగిలి పోవడానికి ప్రధాన కారణం దళితుడు కావడమేనని ఈనాటికి బాబు జగ్జీవన్ రామ్ భారతరత్న ఇవ్వకపోవడం బాధాకరమని ఇప్పటికైనా ఆయనకు భారతరత్న ప్రకటించి నిజమైన నివాళులు అర్పించాలని వారు కోరారు.

**భారీ ఎత్తున నివాళి**

బాబు జగ్జీవన్ రామ్ కు నివాళులు అర్పించిన వారిలో ఎంఎస్ పి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బూడిద జానీ, మండల అధ్యక్షులు ఆకారపు లక్ష్మి నారాయణ, మండల అధికార ప్రతినిధి వద్దిగాళ్ల రాజు, పట్టణ అధ్యక్షులు బూడిద సింహాద్రి, దళిత సంఘాల నాయకులు గ్యాదపాక నర్సయ్య, మేడి శివ కుమార్, కొన్నె సంజీవ, దప్పు వీర స్వామి, బీసీ నాయకులు దండ్ల వెంకటయ్య,అంకం రాజు, పల్లపు రాములు,గ్యాస్ ఆనంద్ తదితరులున్నారు.



## వారం వ్యవధిలో ఇరువురు సిఐల పై వేటు

**దారి తప్పుతున్న సిఐ లపై ఉన్నతాధికారుల చర్యలు పట్ల ప్రజలు హర్షం**

**పల్నాడు :**

పల్నాడు జిల్లాలో పలువురు పోలీస్ సిబ్బంది పనితీరు పై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. వారం రోజుల్లో ఇరువురు సిఐ లపై బదిలీ వేటు పడింది. పల్నాడు లోని దాచేపల్లి సిఐగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్ ను వారం క్రితం ఉన్నతాధికారులు విఆర్ కు బదిలీ చేసారు. మాచర్లలో విధులు నిర్వహిస్తున్న వెంకటరమణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మహిళతో వివాహేతర సంబంధం ఆరోపణలతో ఒక సిఐ పై బదిలీ వేటు పడగా, పరువు హత్య కేసులో నిర్లక్ష్యంతో పాటు నగదు వసూళ్ల చేసినట్లు ఆరోపణలతో మరో సిఐ సస్పెండ్ అయ్యారు. శాఖ పరువు పోయే విధంగా విధి నిర్వహణ చేస్తున్న సిఐ లపై ఉన్నతాధికారులు బదిలీ, సస్పెండ్ వేటు నిర్ణయం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రేమ పేరుతో మోసం

**వివాహితపై సామూహిక అత్యాచారం**



**కూకట్‌పల్లి :**

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, పంజాగుట్ట పరిధిలో లవ్ జిహాద్ పేరుతో ఒక దారుణమైన మోసం వెలుగులోకి వచ్చింది. నవాజ్ అనే వ్యక్తి తాను హిందువునని నమ్మించి, ఒక యువతిని ప్రేమ పేరుతో లోబరుచుకున్నాడు. 2025 జూన్‌లో వీరి వివాహం జరిగింది. పెళ్లి రోజు రాత్రే, నవాజ్ తన స్నేహితులు, సోదరులతో కలిసి యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. మత్తు మందు కలిపిన పానీయం ఇచ్చి, స్పృహ కోల్పోయిన తర్వాత ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

**జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి**



**శామీర్ పేట్, ఏప్రిల్ 5 :**

మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్ రాం జయంతినీ మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని శామీర్‌పేట్ డివిజన్ దేవర యాంజాల్‌లో ఘనంగా నిర్వహించారు . జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు బంగరిగళ్ళ శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్ రాం దేశంలో అనేక కీలక శాఖల్లో బాధ్యతలు నిర్వహిస్తూ పేద,బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ కళా మండలి అధ్యక్షులు యన్.వై. అశోక్, మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ పేండం లక్ష్మీనారాయణ, మాజీ ధర్మకర్తలు పట్నం నర్సింహారెడ్డి, నానిగళ్ళ హరిగోపాల్, బక్కోల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ పచ్చిమడ్ల నర్సింగ్ రావు గౌడ్, మాజీ వార్డు సభ్యులు దుర్గం ప్రకాశ్ గౌడ్, నాయకులు గడ్డమీది జనార్ధన్, రంగప్పగారి నాగరాజు గౌడ్, మిర్యాలకర్ సాయి కుమార్, సుతారిగుడెం దుర్గయ్య, ఈరగళ్ళ మహేందర్ , కళాకారులు, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగు పడి సుడి గేదే మృతి



**తుర్కపల్లి, ఏప్రిల్ 05 :**

పిడుగు పడి సుడి గేదే మృతి చెందిన సంఘటన తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలో జరిగినది. గ్రామానికి చెందిన రైతు జాగిల్లపురం హరికృష్ణ భూమయ్య తన వ్యవసాయ బావి వద్ద ఉన్న షెడ్డులో గేదెను కట్టివేశారు. ఆదివారం ఉదయం వర్షంతో పాటు పిడుగు పడటంతో సుడిగేదే అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సుమారు ఒక ₹ 1,50,000 రూపాయల విలువ గల గేదెను కోల్పోయినట్లు, తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## యువత అన్ని రంగాల్లో ముందుండాలి



**కాప్రా :**

ఈసీఐఎల్ చౌరస్తాలో భ్రమరాంబ ఫుడ్ కోర్ట్ ని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. యువత అన్ని రంగాల్లో ముందుండాలని ఇలాంటి ఫుడ్ కోర్టులో వినియోగదారులకు నాణ్యత అందించాలని ఆయన సూచించారు నిర్వాహకులు సాయి దంపతులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, BRS పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాసం మైపాల్ రెడ్డి, కుమారస్వామి, పాండాల శివకుమార్ గౌడ్, రహీం, తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్‌రెడ్డి, పోలూరి నాగార్జున, పిల్లి సాయిరాం, మల్లికార్జునరావు, కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌లు



**కాప్రా :**

కాప్రా డివిజన్ పరిధిలోని క్లాసిక్ ఎన్‌క్లేవ్‌లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన ఓపెన్ జిమ్, చిన్నారుల పార్కును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం, పిల్లల వినోదం దృష్ట్యా ఇలాంటి సౌకర్యాలను అభివృద్ధి చేయడం ఎంతో ముఖ్యమని తెలిపారు. కాలనీలలో ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌లు, పిల్లలు ఆడుకునే పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్ కాలని వాసులు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అణగారిన వర్గాల ఉద్ధరణ కోసం జీవితాంతం

**మల్లాపూర్ :**

మల్లాపూర్ అరుంధతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డా. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకల సందర్భంగా మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. భారతరత్న డా. బాబు జగ్జీవన్ రామ్ సామాజిక న్యాయం, అణగారిన వర్గాల ఉద్ధరణ కోసం జీవితాంతం పోరాడిన మహనాయకుడు. ఆయన ఆశయాలు, సేవలు ఎప్పటికీ మరువలేనివని ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏడేళ్ల గణేష్, లక్ష్మీపతి, వెంకట్ ప్రసాద్, వినయ్, కమిటీ సభ్యులతో పాటు స్థానిక నాయకులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

## సీసీ రోడ్ల పనుల ప్రారంభం



**కాప్రా :**

కాప్రా డివిజన్ పరిధిలోని శాంతి విల్లే కాలనీలో రూ. 60 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్ల పనుల ప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండారి లక్ష్మారెడ్డి సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీల అభివృద్ధి తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా రవాణా సమస్యలు తగ్గి, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. శాంతి విల్లే కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్, కాలనీ వాసులు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల



**ఉప్పల్ :**

HMT నగర్ డివిజన్ రాఘవేంద్ర నగర్‌లో Dr. బి.ఆర్. అంబేద్కర్ సామాజిక సంక్షేమం ఆధ్వర్యంలో Dr. బాబు జగ్ జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను అధ్యక్షులు ఎం. సంజన్న, ప్రధాన కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మా రెడ్డి హాజరై బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం బాబా సాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, మెడల మల్లికార్జున్ గౌడ్, కె. రామ్ బాబు, Dr. రమేష్, వెంకటేశ్వర్ రెడ్డి, మేకల ముత్యం రెడ్డి, అషు, మహేష్ యాదవ్, మురళి, మారయ్య, రాజు బాబు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం కోసం బాబు జగ్జీవన్ రామ్ పోరాడారు..!

**జగ్జీవన్ రామ్ కు నివాళులు అర్పించిన కౌన్సిలర్ గాదె వెంకటేష్**



**శామీర్ పేట్, ఏప్రిల్ 5 :**

అలియాబాద్ మున్సిపల్ ఆవరణలో దివంగత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గాదె వెంకటేశ్ పాల్గొని జగ్జీవన్ రామ్ కు ఘన నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు నిరంతరం కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా తన పరిపాలన దక్షతతో దేశ ప్రజలకు సుపరిపాలన అందించిన మహానేత జగ్జీవన్ రామ్ అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కాంకనబద్ధులై ఉండాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గుర్క కుమార్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, బండి రాఘవరెడ్డి, తాళ జగదీష్ గౌడ్, మసుదన్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మృత్యుపాశంగా పసుమర్రు మలుపు

**చిలకలూరిపేట:**

మండలంలోని పసుమర్రు గ్రామ సమీప మలుపు వద్ద శనివారం ఘోర ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన పర్చూరు తహసీల్దార్ కారు, బైక్‌ను బలంగా ఢీకొనడంతో పసుమర్రుకు చెందిన మైల సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందారు. వారం వ్యవధిలోనే ఇదే మలుపు వద్ద ఇది మూడో ప్రమాదం కావడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్లే ఈ 'డెత్ జోన్'లో ప్రాణాలు పోతున్నాయని, వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# డ్రైవింగ్ లైసెన్స్ అంత ఈజీ కాదు..

**తెలంగాణ రవాణా శాఖ సరికొత్త నిర్ణయం**




**హైదరాబాద్, ఏప్రిల్ 5:**

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలో భారీ మార్పులు రాబోతున్నాయి. ఇకపై లెర్నర్స్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవటమే కాదు. అంతకంటే ముందే రోడ్డు భద్రతపై అవగాహన పరీక్షను పాస్ కావాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం.. డ్రైవింగ్ లైసెన్స్ పొందడం మరింత కఠినతరం కానుంది. ఈ మేరకు తెలంగాణ రవాణా శాఖ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి ఎల్ఎల్ఆర్, ఫైనల్ డ్రైవింగ్ టెస్ట్ అనే రెండు దశలు ఉన్నాయి. ప్రతిపాదిత కొత్త విధానం అమల్లోకి వస్తే ఇది మూడు దశల ప్రక్రియగా మారుతుంది. దీని ప్రకారం.. అభ్యర్థి మొదట ఆన్‌లైన్ రోడ్డు భద్రతా అవగాహన పరీక్షను పూర్తి చేయాలి. దీనిపై ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేశామని.. ఏప్రిల్ నెలాఖరు నాటికి నివేదిక వస్తుందని రవాణా శాఖ జాయింట్ కమిషనర్ ఎం. చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా ఈ పరీక్షను తప్పనిసరి చేస్తారు. ఈ ఆన్‌లైన్ శిక్షణ, పరీక్షా విధానం మొత్తం ఆరు మాడ్యూల్స్‌గా ఉంటుంది. ఒక్కో మాడ్యూల్ 30 నిమిషాల పాటు, మొత్తం 3 గంటల సమయం పడుతుంది. ఇందులో వీడియో ఆధారిత పాఠాలు, రోడ్డు భద్రతా క్రమశిక్షణ, ట్రాఫిక్ నిబంధనలపై శిక్షణ ఇస్తారు. ప్రతి మాడ్యూల్ చివరలో చిన్న పరీక్ష ఉంటుంది.

అభ్యర్థులు తమ ఇంటి వద్దనే కెమెరా ఉన్న ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్ ద్వారా ఈ పరీక్షను రాయవచ్చు. గుర్తింపు పొందిన డ్రైవింగ్ స్కూళ్లలో హాజరు కావచ్చు. ఈ శిక్షణలో ప్రధానంగా రోడ్డు ప్రమాదాలకు దారితీసే కారణాలు, అద్దాల వినియోగం, సురక్షితంగా ఓవర్‌టేకింగ్ చేయడం వంటి అంశాలను వివరిస్తారు. వాస్తవ ప్రమాదాల వీడియోలను చూపిస్తూ డ్రైవర్లు చేసే పొరపాట్లపై అవగాహన కల్పిస్తారు. ఈ ఆన్‌లైన్ కోర్సు పూర్తి చేసిన తర్వాత ఒక యూనిక్ సర్టిఫికేట్ నంబర్ కేటాయిస్తారు. ఆ నంబర్ ఉంటేనే ఎల్ఎల్ఆర్ దరఖాస్తు చేసుకోవడానికి సాధ్యమవుతుంది. భారతదేశంలో ఏటా సుమారు 1.7 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. తెలంగాణలో కూడా మరణాల సంఖ్య ఆందోళనకరంగా ఉంది. ఈ నేపథ్యంలోనే లైసెన్స్ జారీ చేసే ముందే రోడ్డు భద్రతపై ప్రాథమిక అవగాహన కల్పించడం వల్ల బాధ్యతాయుతమైన డ్రైవర్లను తయారు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ డిజిటల్ విధానం వల్ల రవాణా కార్యాలయాల్లో దళారీల ప్రమేయం తగ్గి, పారదర్శకత పెరుగుతుందని రవాణా శాఖ ఆశిస్తోంది.

# భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావ్ జయంతి



**సైదాపూర్ :**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దెనపల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దేశంలోనే సామాజిక న్యాయసాధనకు గొప్ప కృషిచేసిన భారత మాజీ ఉప ప్రధాని Dr బాబు జగ్జీవన్ రావ్ 119వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. సంఘం అధ్యక్షులు బోరగాల్ల మల్లేష్, ఉపాధ్యక్షులు దూల సురేష్, మోలుగురి కిరణ్, ప్రధాన కార్యదర్శి మోలుగురి భూపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి బోరగాల్ల రాజేందర్, సంయుక్త కార్యదర్శి కావంపల్లి రాకేష్, అంతేల్పుల రాజు, దూల పవన్, కోశాధికారి తునికి దేవేందర్, గౌరవ సలహాదారులు మట్టల రవీందర్, కొమ్ముల బిక్షపతి పాల్గొన్నారు.

ముఖ్యఅతిథిగా దుద్దెనపల్లి గ్రామ సర్పంచ్ ఉడికె విజయ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండాల శ్రీనివాస్, ఆదేపు రాజేందర్, చిన్న వెంకటేశం, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సోమవారపు రాజయ్య, మాజీ సర్పంచ్ తాటిపల్లి యుగంధర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మట్టెల రవీందర్, గోపాలమిత్ర రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, దూల పోచయ్య, బోరగాళ్ల సంజీవ్, మాచర్ల రమేష్, పలుకుల సంఘం నాయకులు, మేధావులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి నోరు విప్పితే ఆ అవినీతి బడా నాయకుడు ఎవరో తెలుస్తుంది



**బడంగ్‌పేట్ :**

బడంగ్‌పేట్ సర్కిల్ 16లో బయటపడిన భారీ అవినీతి కుంభకోణంలో భాగంగా పదిమంది అధికారుల సస్పెన్షన్ జరగడం ఈ వ్యవహారం ఎంత తీవ్రంగా ఉందో స్పష్టం చేస్తోంది. అయితే ఈ అవినీతి వెనుక ఒక ప్రభావశీల రాజకీయ నాయకుడు ఉండి, అధికారులను బెదిరిస్తూ, తప్పుదోవ పట్టిస్తూ బడంగ్‌పేట్ ప్రజల కష్టార్జిత ధనాన్ని దోచుకున్నాడనే ఆరోపణలు మరింత కలవరపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో బడంగ్‌పేట్ భారతీయ జనతా పార్టీ 61వ డివిజన్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమం ఘాటుగా నిర్వహించబడింది. ప్లకార్డులు పట్టుకుని సరస్వతి వెంటనే నోరు విప్పాలి, సస్పెండ్ అయిన అధికారులు నిజాలు బయటపెట్టాలి.

అసలు సూత్రధారుల పేర్లు వెల్లడించాలి అంటూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ఒక అవినీతి రాజకీయ నాయకుడు అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తూ, వారిని అడ్డంగా ఉపయోగించుకుని ప్రజల సొమ్మును దోచుకున్నాడని తీవ్ర ఆరోపణలు చేస్తూ, ఆ నాయకుడి పేరు వెంటనే బయట పెట్టాలని సస్పెండ్ అయిన అధికారులు, డీసీ సరస్వతిని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ అంశంపై బీజేపీ నాయకులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఘాటుగా స్పందిస్తూ, "ఇది చిన్న విషయం కాదు – ప్రజల డబ్బును కొల్లగొట్టిన దోపిడీ. ఇందులో ఉన్న పెద్దలెవ్వరైనా బయటకు రావాల్సిందే. నిజాలు దాచిపెట్టే ప్రయత్నాలు చేస్తే బీజేపీ మరింత పోరాడుతుంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదు" అని హెచ్చరించారు.

# మహనీయుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**ఘనంగా షాద్ నగర్ లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119 జయంతి వేడుకలు**



**షాద్ నగర్, ఏప్రిల్ 05 :**

భారత దేశ మాజీ ఉప ప్రధాన మంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి పునస్కరించుకొని షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ నేత జాంగారి రవి ఆధ్వర్యంలో బ్లాక్ ఆఫీస్ ముందు వున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.... భారత దేశ ఉప ప్రధాన మంత్రి 50 ఏళ్ళ రాజకీయ జీవితంలో దాదాపు 40 ఏళ్లు పార్లమెంట్ సభ్యులుగా, కార్మిక, రక్షణ వ్యవసాయ శాఖల మంత్రిగా పనిచేసి దళిత బహుజనుల అభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప దళిత నేత, గొప్ప పరిపాలనాధ్యక్షుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ భారత మాజీ ఉపప్రధానిగా, ఈ దేశంలో 40 ఏండ్ల సుదీర్ఘ పార్లమెంటరియన్ బాబు జగ్జీవన్ రామ్ అని తెలిపారు. దళితులలో అత్యున్నత స్థానాలను అధిరోహించిన గొప్ప నేత బాబు జగజీవన్ రామ్ అని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వాం, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నేతలు రఘు నాయక్, కృష్ణ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వెంకట్ రాంరెడ్డి, బాధేపల్లి సిద్దార్థ, కొమ్ము కృష్ణ, కౌన్సిలర్స్ పెంటయ్య, దిలీప్ కుమార్, ముబరక్, మల్లేష్ గౌడ్, సీతారాం, టీడీపీ నేత గంధం ఆనంద్, భాస్కర్ రెడ్డి, సర్పంచులు ఎంసి రాజు, నాగిల్ల వెంకటేష్, శివకుమార్ యాదవ్, జేఏసీ నేతలు ఎం జనార్ధన్, నర్సింహులు, దళిత ఉద్యోగ సంఘాల నేతలు ఎర్ర నర్సింహులు, భేరి లింగం, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే జిఎంఆర్ ను సన్మానించిన నారాయణపేట జిల్లా కోర్టు బార్ అసోసియేషన్

**దేవరకొండ :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్)ను ఆదివారం నారాయణపేట జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. చిన్నచింతకుంట మండలం ధమగ్నాపూర్ లో ఈ సన్మాన కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకొచ్చిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకు రావడంలో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఈ సందర్భంగా వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గానికి ఎమ్మెల్యే జిఎంఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



**నేరడుగొమ్ము :**

నేరేడు గోమ్ము మండలం చిన్నమునిగల్ గ్రామానికి చెందిన రాజ్ కుమార్ శ్రీలత ల వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసినారు. ఆయన వెంట బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, దేవరకొండ మండల పార్టీ అధ్యక్షులు TVN రెడ్డి, కౌన్సిలర్ కేతావత్ రుప్లా నాయక్, చెన్నారం సర్పంచ్ తులసీరామ్ నాయక్, బొడ్డుపల్లి కృష్ణ, కేతావత్ హరిలాల్ నాయక్, కేతావత్ లాలు నాయక్, నాగార్జున నాయక్, తదితరులు ఉన్నారు.

## రేషన్ డీలర్ పై 6ఏ కింద కేసు నమోదు



**డిండి :**

డిండి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో గల రేషన్ షాపును దేవరకొండ డి టి సివిల్ సప్లై మోబిన్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ తనిఖీ లో రేషన్ సరుకుల లో భారీగా వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించినారు. రికార్డుల ప్రకారం ఉండవలసిన నిల్వలకు షాప్ లో ఉన్న సరుకుల లో తేడా ఉండడంతో నిబంధనల ముల్లంగిన కింద అధికారులు సదరు రేషన్ షాపును సీజ్ చేసినారు అనంతరం డీలర్ పై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలియజేసినారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించినారు.

# సిద్ధాంతాలతో బీజేపీ బలోపేతం

**కార్యకర్తలే అసలైన బలం**

**బిజెపి నాయకుడునెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**



**షాద్ నగర్, ఏప్రిల్ 05 :**

ఇబ్రహీం పట్నం నియోజకవర్గ పరిధిలోని మంచాల్ మండలం, ఇబ్రహీం పట్నం రూరల్ మండలాల్లో నిర్వహించిన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ్ మహాభియన్ శిక్షణ కార్యక్రమంలో బీజేపీ నేత నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రమేష్, శేకర్ రెడ్డి ల మండల అధ్యక్షతన ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి....బీజేపీ ఒక సిద్ధాంతపరమైన పార్టీగా కార్యకర్తల శక్తిపై నిర్మితమైందని పేర్కొన్నారు. సాధారణ కార్యకర్తలను కూడా ఉన్నత స్థాయి నాయకులుగా తీర్చిదిద్దే ప్రత్యేకమైన సంస్థాగత వ్యవస్థ బీజేపీకి మాత్రమే ఉందని తెలిపారు. బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు క్రమబద్ధమైన నిర్మాణంతో పార్టీ ముందుకు సాగుతున్నదని వివరించారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన సమగ్ర మానవవాదం, సాంస్కృతిక జాతీయవాదం బీజేపీ ఆలోచనా ధారకు మూల స్తంభాలని పేర్కొన్న ఆయన, ఈ సిద్ధాంతాల ఆధారంగా సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకుంటూ సమగ్ర అభివృద్ధి సాధించడమే పార్టీ లక్ష్యమని తెలిపారు. అంత్యోదయ భావనను ప్రస్తావిస్తూ సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరేలా కృషి చేయడం బీజేపీ ప్రధాన ధ్యేయమని చెప్పారు.అలాగే బీజేపీ పంచ నిష్ఠలు పార్టీకి మార్గదర్శక సూత్రాలుగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రవాదం, లోకశాహి, సామాజిక సమరసత, సానుకూల ధర్మనిరపేక్షత, విలువల ఆధారిత రాజకీయాలు అనే ఐదు నిష్ఠలు కార్యకర్తలకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తూ పార్టీని మరింత బలపరుస్తున్నాయని పేర్కొన్నారు. "దేశం ముందుగా పార్టీ తర్వాత సేవా భావం, క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేసే కార్యకర్తలే బీజేపీకి అసలైన బలం అని పేర్కొన్న ఆయన, ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా సంవత్సరం పొడవునా ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. తెలంగాణలో బలమైన సంస్థాగత నిర్మాణాన్ని మరింత విస్తరించి, సిద్ధాంత పరమైన కార్యకర్తలను తీర్చిదిద్దడం ద్వారా బీజేపీని ప్రజల పార్టీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేస్తూ భవిష్యత్తులో ప్రజాస్వామ్య పద్ధతిలో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొని శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

---



## సామాజిక న్యాయం కోసం పోరాడిన నేతకు ఘన నివాళులు

**జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన : బాబు**

**శామీర్ పేట్, ఏప్రిల్ 5 :**

అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో దివంగత నేత, మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బాబు పాల్గొని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరగని కృషి చేసిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, అశోక్, మైసంగూడ కృష్ణ గ్రామస్తులు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---

## శామీర్ పేటలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నాయకులు, యువకులు**



**శామీర్ పేట్, ఏప్రిల్ 5 :**

శామీర్‌పేట్‌లో స్వతంత్ర సమరయోధుడు, భారతదేశ మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, యువకులు కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. సామాజిక న్యాయం కోసం వారు చేసిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కోసం అందరూ పాటుపడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడి రవి, డప్పు మురళీ, చిన్న బాబు, కొమ్ము యాదగిరి, మొరుగు శ్రీకాంత్, సాయి, సురేష్, విజయ్, గణేష్, జోయెల్, ప్రసాద్, కె శ్రీకాంత్, భాస్కర్, బి రవి తదితరులు పాల్గొన్నారు.

---

## ఫ్లైఓవర్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**దేవరకొండ :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మదనాపురంకొత్తపల్లి మధ్య ఊకచెట్టు వాగుపై నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణ పనులను ఆదివారం కాంట్రాక్టర్ మరియు ఇంజనీర్లతో కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వంతెన పనులు వేగవంతం చేయాలని సంబందించిన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

---

## దేవరకద్ర లో ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**హాజరైన మున్సిపల్ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి**



**దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఆదివారం భారత మాజీ ఉప రాష్ట్రపతి బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి తో పాటు వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

---



## నేడు లాల్ కోటకు ఎమ్మెల్యే జిఎంఆర్ రాక

**దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్న చింతకుంట మండలం లాల్ కోట గ్రామానికి సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) వస్తున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు లాల్ కోటలో విజయ డైరీ పార్లర్ ను విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభిస్తారు. కావున ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

---

## కానిస్టేబుల్ కుటుంబానికి నివాళులార్పించిన కౌన్సిలర్

**దుబాసి వెంకటస్వామి**



**పరకాల ఏప్రిల్ 05 :**

ఆదివారం పరకాల పట్టణానికి చెందిన దుబాసి కొండయ్య ఉద్యోగ రీత్యా హన్మకొండలో స్థిరపడి హెడక్వార్టర్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తూ అనుమానస్పద స్థితిలో మరణించడం జరిగింది. తన స్వగ్రామం అయిన పరకాలకు తన అంత్యక్రియలు నిమిత్తం తీసుకురాగా పరకాల 1వ వార్డు కౌన్సిలర్ దుబాసి వెంకటస్వామి కానిస్టేబుల్ దేహానికి నివాళులు అర్పించి తన కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటస్వామి తో పాటుగా బీ జే పి కాంటెస్టెడ్ కౌన్సిలర్ దుబాసి కృష్ణప్రసాద్, కుల పెద్దలు దుబాసి మధుకర్, దుబాసి రవీందర్, దుబాసి తిరుపతి, దుబాసి సహదేవ, దుబాసి రాణా ప్రతాప్ బండి కొమురయ్య, దుబాసి లింగ మూర్తి , దుబాసి రాజయ్య, దుబాసి రాజేష్, దుబాసి కిషోర్ దుబాసి అభి, కాషామళ్ళ గోవర్ధన్, కాషామళ్ళ సోంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

---

## చిన్నారి ద్రాక్షను ఆశీర్వదించన సోదా రామకృష్ణ



**పరకాల ఏప్రిల్ 05 :**

పరకాల మున్సిపాలిటీ 2వ వార్డు కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బొచ్చు లావణ్య సంపత్ గార్ల కుమార్తె ద్రాక్ష కి నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ. ఈ కార్యక్రమలో రామకృష్ణ తో పాటుగా నాయకులు బొచ్చు అనంత్, బొచ్చు జెమిని, ఏకు మనోజ్, బొచ్చు, రమేష్, బొచ్చు శ్రీను,ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, బొచ్చు అఖిల్, ఎస్ ఎఫ్ ఐ పరకాల పట్టణ అధ్యక్షులు ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

---

## దళితుల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడు బాబు జగ్జీవన్ రామ్

**జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు శంకర్**

**మహబూబ్ నగర్ లో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు**



**దేవరకద్ర :**

బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు కే. శంకర్ అన్నారు. మహబూబ్ నగర్ లోని తెలంగాణ చౌరస్తా వద్ద ఆదివారం భారతదేశ మొట్టమొదటి ఉప ప్రధాని, సమాజవాది, స్వాతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ 119 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాటి గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులతో కలిసి గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ ప్రసంగించారు. దళితుల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడు జగ్జీవన్ రామ్ అని అన్నారు. సమానత్వం మరియు సామాజిక న్యాయం కోసం జీవితాంతం ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. దేశ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు, దేశభక్తి ఎంతో తోడ్పడ్డాయ న్నారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సుభాష్ రాథోడ్, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి చంద్రనాయక్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గంజానాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమంతు, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్, సోమనాథ్, బాబురావు లతోపాటు జిల్లా అధికారులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

---

## నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

**రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ 10 లక్షలకు పెంపు**

**మాజీ ఎంపీపీ మోహన్**



**గజ్వేల్ ఏప్రిల్ 5 :**

గ్రామీణ రోగుల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తుండగా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సైతం కార్పొరేట్ వైద్యం అందుతున్నట్లు మాజీ ఎంపీపీ మోహన్ పేర్కొన్నారు. ఆదివారం వర్గల్ మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డితో కలిసి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రత్యేక నిధులు కేటాయిస్తుండగా, రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ 10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. పేదలు కార్పొరేట్ వైద్యం పొందిన పక్షంలో వారిని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నట్లు చెప్పారు. అంతేగాకుండా అత్యవసర పరిస్థితుల్లో ఎల్ఓసిలు అందజేస్తూ రోగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందిస్తుండగా, పేదలు సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు నందు, జగన్ గుప్త పాల్గొన్నారు.

---

## పద్మశాలి ఆఫీసియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

**దేవరకొండ :**



పద్మశాలి ఆఫీసియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ నల్గొండ సర్వసభ్య సమావేశంలో ఇటీవల జిల్లాలో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికలలో గెలుపొందిన పద్మశాలి కౌన్సిలర్స్, చైర్మెన్లను దేవరకొండ నుండి పున్న శైలజ వెంకటేశ్వర్లు, చండూరు కోడి శ్రీనివాసులను పోపా అధ్యక్షులు రావిరాల నర్సయ్య, కార్యదర్శి, కోశాధికారి శాలువాలతో సత్కరించినారు. ఇట్టి సమావేశం శ్రీ బృగువంశీ వృద్ధాశ్రమం నూతన భవనంలో జరిగినది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ఏడు కోట్ల అంచనాతో పద్మశాలి వృద్ధాశ్రమం, విద్యార్థులకు వసతి గృహము ఏర్పాటు జరుగుతుంది, ప్రస్తుతానికి రెండు అంతస్తులు పూర్తి అయినది అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ పోపా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పగిడిమర్రి సత్యమూర్తి, అంకం చంద్రమౌళి, వనం పులిరాజు అందరు పోపా అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గం,సభ్యులు పాలుగొన్నారు. భవన పూర్తి చేయుటకు దాతలు ముందుకు రావలసినదిగా కోరినారు.

---

## తిరుపతిలో దారుణం

**మహిళ పై అత్యాచారయత్నం..**

**తిరుపతి :**

బాబుతో ఉన్న ఒంటరి మహిళపై ఇంటి యజమాని అత్యాచారయత్నం చేసారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరాం నగర్ అక్కారం పల్లి రోడ్డులో ఈ నెల 2న గురువారం తెల్లవారుజామున ఘటన జరిగింది. మహిళపై దారుణంగా వికృత చేష్టలు చేసి ఫోన్లో ఫోటోలు తీసి బ్లాక్ మెయిల్ చేసి భయపెట్టిన వైనం బయటపడింది. భర్త విదేశాలలో ఉండడంతో మహిళ పుట్టింటికి వెళ్ళి బంధువుల సహాయంతో ఫిర్యాదు చేసింది. ఇంటి యజమాని శ్రీనివాసులు రెడ్డి పై పోలీసులు కేసు నమోదు చేసారు. రెండు రోజులపాటు శ్రమించి ఎట్టకేలకు అలిపిరి పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దున నిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం. శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

### పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి. ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

### సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్


సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.





# నెల రోజుల పాటు.. చక్కెర తినడం మానేసి చూడు

**మనం తీసుకునే ఆహారంలో చక్కెర ఒక భాగమైనదని చెప్పవచ్చు. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో చక్కెరను తీసుకుంటూనే ఉంటాం. టీ, కాఫీ, జ్యూస్, స్వీట్స్, కుక్కీస్ ఇలా ఏదో ఒక రూపంలో చక్కెర మన శరీరంలోకి వెళ్తూనే ఉంటుంది. అయితే చక్కెరను తీసుకోవడం 30 రోజుల పాటు మానేయడం వల్ల మనం అనేక శారీరక, మానసిక మార్పులను గమనించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే చక్కెరను మానేసిన తరువాత మొదట్లో మనం కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెరను తీసుకోవడం మానేసిన తరువాత చిరాకు, అలసట, ఆందోళన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మెదడు చక్కెర అందించే డోపమైన్ హిట్ ను కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. చక్కెర తీసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. శరీరం నెమ్మదిగా చక్కెరకు దూరం అయ్యే కొద్దీ ఈ కోరికలు తగ్గుతూ వస్తాయి.**

### కొవ్వు కరుగుతుంది..

డిటాక్స్ ట్రెండ్ కంటే ఎక్కువగా చక్కెరను తీసుకోకపోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలే ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా చక్కెరను తీసుకోవడం తగ్గించడం వల్ల క్రమంగా రెండవ వారం నాటికి రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో గ్లూకోజ్ మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఇన్సులిన్ స్థాయిలు తగ్గడంతో శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించడం ప్రారంభిస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఇక మూడవ వారం కూడా చక్కెరను తీసుకోవడం మానేయడం వల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాలనుగమనించవచ్చు. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దద్దుర్లు, మంట, మొటిమలు, పగుళ్లు వంటివి తగ్గుతాయి. అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. రక్తంలో చక్కెర క్రాష్ లు తగ్గడం వల్ల మనం మరింత స్థిరంగా దృష్టి కేంద్రీకరించవచ్చు.

### కొలెస్ట్రాల్ అదుపులో..

క్యాలరీలు తీసుకోవడం తగ్గడం వల్ల శరీర బరువు తగ్గడాన్ని మనం ఎక్కువగా గమనించవచ్చు. అంతేకాకుండా అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక చక్కెర ఉండే స్వీట్లు, పానీయాలు, బేక్ చేసిన వస్తువులు తీసుకోవడం తగ్గించడం వల్ల ప్రజలు పండ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడానికి మొగ్గు చూపుతారు. దీంతో శరీరానికి కావల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. చక్కెర కలిగిన ఆహార పదార్థాలకు బదులుగా నానబెట్టిన ఖర్జూరాలు, పెరుగు వంటి వాటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

### ఉత్సాహంగా మారుతారు..

అంతేకాకుండా చక్కెరలో వచ్చే హెచ్చుతగ్గులు బద్దకం, చిరాకుకు కారణమవుతాయి. కనుక చక్కెరను మానేయడం వల్ల మనం ఉత్సాహంగా ఉండడంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇలా నెలరోజుల పాటు చక్కెర తీసుకోవడం మానేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. చక్కెర మానేయడం తాత్కాలికంగానే కాకుండా స్థిరమైన జీవనశైలి ఎంపికగాఉండాలని వారు సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం వంటి వాటిని మితంగా తీసుకోవాలి. అలాగే తీపి వంటకాల తయారీలో చక్కెరకు బదులుగా యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటిని వాడడం వల్ల తీపి తింటున్నామన్న అనుభూతి పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.



# జంక్ ఫుడ్ మానేస్తే.. మీ ముఖంలో కనిపించే మార్పులు

**జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని అందరికీ తెలుసు. అయినా సరే చాలామంది ఆ ఫుడ్ నే ఇష్టంగా తింటుంటారు. కానీ జంక్ ఫుడ్ ని ఒక 30 రోజులు మానేస్తే మీ శరీరంలో ఎన్ని మార్పులు జరుగుతాయో తెలుసా? ముఖ్యంగా ఫేస్ లో కనిపించే ఈ మార్పులు చూస్తే షాక్ అవుతారు.**

### 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే..

మనలో చాలామంది ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ స్నాక్స్, కేక్‌లు, చిప్స్ వంటి పదార్థాలను ఇష్టంగా తింటుంటారు. కానీ అవి మన శరీరం, ముఖ్యంగా చర్మంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తెలుసా? ఆరోగ్య నిపుణులు, స్కిన్ కేర్ ఎక్స్‌పర్ట్‌ల ప్రకారం కేవలం 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా ముఖంలో కలిగే మార్పులేంటో ఇక్కడ తెలుసుకుందాం.

### మృదువుగా మారుతుంది

జంక్ ఫుడ్ ఎక్కువగా సాచ్యూరేటెడ్ ఫ్యాట్స్, షుగర్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది చర్మంలో ఇన్ఫ్లమేషన్ ను పెంచుతుంది. ముడతలు, ఎరుపు, పొడిబారడం వంటి సమస్యలకు కారణమవుతుంది. జంక్ ఫుడ్ మానేసిన వెంటనే, శరీరంలోని ఇన్ఫ్లమేటరీ రియాక్షన్స్ తగ్గుతాయి. 30 రోజుల్లో చర్మం సహజంగా హైడ్రేటెడ్ గా, మృదువుగా మారుతుంది. ముఖ్యంగా కేకులు, కోల్డ్ డ్రింక్స్, చిప్స్ మానడం వల్ల చర్మం.. లోపలి తేమను నిలుపుకోవడానికి అవకాశం ఉంటుంది.

### కొల్లాజెన్ ఉత్పత్తిపై ప్రభావం

షుగర్ అధికంగా తీసుకోవడం వల్ల చర్మంలోని కొల్లాజెన్ దెబ్బతింటుంది. కొల్లాజెన్ శక్తిని కోల్పోవడం వల్ల చర్మంపై ముడతలు మొదలవుతాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా, కొల్లాజెన్ ఉత్పత్తి సక్రమంగా ఉంటుంది. దానివల్ల చర్మం స్థిరంగా ఉంటుంది, ముడతలు తగ్గుతాయి. కాంతివంతంగా మారుతుంది.

### ముఖం స్లిమ్ గా కనిపించడం

జంక్ ఫుడ్ ఎక్కువగా సోడియం, ఫ్యాట్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో వాటర్ రిటెన్షన్, మలినాలు, ఫేస్ బ్లోటింగ్ కు కారణమవుతుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం, 30 రోజులు జంక్ ఫుడ్ మానేసి.. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఫేస్ బ్లోటింగ్ తగ్గి ముఖం స్లిమ్ గా కనిపిస్తుంది. అలాగే, యాంటీ ఆక్సిడెంట్‌లు ఎక్కువగా ఉండే ఫుడ్స్ తీసుకోవడం వల్ల చర్మం లోపలి నుంచి మెరుగుపడుతుంది.

### ముఖం ఫ్రెష్ గా..

జంక్ ఫుడ్ లోని ఫ్యాటీ, ప్రాసెస్డ్ పదార్థాలు శరీరంలోని యాంటీఆక్సిడెంట్ స్థాయిలను తగ్గిస్తాయి. చర్మం యూవీ కిరణాల ప్రభావానికి లోనవుతుంది. జంక్ ఫుడ్ మానేసి.. ఇతర ఫ్రూట్స్, వెజిటబుల్స్ తీసుకుంటే వాటిలోని యాంటీ ఆక్సిడెంట్‌లు చర్మ రికవరీని వేగవంతం చేస్తాయి. సన్‌డ్యామేజ్ తగ్గి, చర్మం తాజాగా మారుతుంది.

### ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

చర్మంలో కనిపించే ఈ మార్పులు మానసికంగా పెద్ద మార్పులకు దారితీస్తాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే.. ముఖం స్పష్టంగా మెరుస్తుంది, చర్మం ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. జంక్ ఫుడ్ మానేయడం ఒక్క చర్మ ఆరోగ్యానికే కాదు.. మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు చేస్తుంది.




# లక్నో సూపర్ బోణీ..

ఈ సీజన్‌లో సొంతగడ్డపై ఆడిన తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఓటమి ఎదురైంది. గత మ్యాచ్‌లో ఈడెన్ గార్డెన్ వేదికగా ఆల్‌రౌండ్ ఆటతో గెలుపు బోణీ కొట్టిన సన్‌రైజర్స్.. సొంత మైదానంలో సూపర్‌జెయింట్స్ చేతిలో తడబాటుకు గురై అభిమానులను నిరాశకు గురిచేసింది. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియం వేదికగా ఆదివారం 'లాస్ట్ ఓవర్ థ్రిల్లర్'గా సాగిన పోరులో లక్నోదే పైచేయి అయింది. మొదట మహ్మద్ షమీ (2/9) అదిరిపోయే ఓపెనింగ్ స్పెల్‌తో తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ నిర్ణీత ఓవర్లలో 156/9కే పరిమితమైంది. హెన్రిచ్ క్లాసెన్ (41 బంతుల్లో 62, 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), నితీశ్ కుమార్ రెడ్డి (33 బంతుల్లో 56, 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఆదుకో కుంటే ఆ జట్టు పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఛేదనలో కెప్టెన్ రిషభ్ పంత్ (50 బంతుల్లో 68 నాటౌట్, 9 ఫోర్లు) సాధికారిక ఇన్నింగ్స్‌కు ఎయిడెన్ మార్క్మ్ (27 బంతుల్లో 45, 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు తోడవడం తో ఛేదనను ఆ జట్టు 19.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. షమీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.29/4.. హెడ్ (7), అభిషేక్ (0), ఇషాన్ (1), లి వింగ్‌స్టొన్ (14) వంటి బ్యాటింగ్ లైనప్ ఉన్న హైదరాబాద్ 8 ఓవర్లలో చేసిన స్కోరిది!

నిరుటి సీజన్ దాకా సన్‌రైజర్స్‌తో ఉండి ఈ సీజన్‌లో లక్నోకు ట్రేడ్ అయిన షమీ పేస్ పదునుకు ఆతిథ్య జట్టు విలవిల్లాడింది. తన తొలి ఓవర్లోనే అభిషేక్‌ను ఔట్ చేసిన అతడు.. రెండో ఓవర్ ఫస్ట్ బాల్‌కు హెడ్‌నూ పెవిలియన్‌కు పంపి ఆదిలోనే ఎస్ఆర్‌హెచ్‌ను దెబ్బతీశాడు. మరుసటి ఓవర్లో ప్రిన్స్.. ఇషాన్‌ను బౌల్డ్ చేయగా ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన లివింగ్‌స్టొన్‌ను దిగ్వేశ్ బోల్తా కొట్టించాడు. షమీ వరుసగా 4 ఓవర్లు విసిరి 9 పరుగులు మాత్రమే ఇవ్వడంతో సన్‌రైజర్స్ 10 ఓవర్లకు చేసిన స్కోరు 35/4 మాత్రమే. ఆ స్థితి నుంచి హైదరాబాద్ ఈమాత్రం స్కోరైనా చేసిందంటే అది నితీశ్, క్లాసెన్ చలవే. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 63 బంతుల్లో 116 రన్స్ జోడించి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. ప్రిన్స్ 11వ ఓవర్లో చెరో సిక్స్ కొట్టిన ఈ ద్వయం బ్యాట్‌కు పనిచెప్పడంతో స్కోరువేగం పుంజుకుంది. అవేశ్ ఓవర్లో క్లాసెన్ నాలుగు ఫోర్లు బాదగా దిగ్వేశ్ ఓవర్లో నితీశ్ 3 సిక్స్‌లు కొట్టాడు. అయితే అర్ధ శతకాల తర్వాత ఈ ఇద్దరూ వరుస ఓవర్లలో నిష్క్రమించ డంతో సన్‌రైజర్స్ మళ్లీ తడబడింది. లోయరార్డర్ కూడా బ్యాట్ ఝుళిపించలేకపోయింది.

ఛేదన స్వల్పమే అయినా లక్నో ఇన్నింగ్స్ సైతం ఒడిదొడు కులకు లోనైంది. మలింగ.. నాలుగో ఓవర్లో మార్ష్ (14) ను ఔట్ చేసినా పంత్ అండతో మార్క్మ్ ధనాధన్ మెరుపులు మెరిపించాడు.

నితీశ్ రెండో ఓవర్లో మూడు బౌండరీలు కొట్టిన అతడు.. ఉనద్కత్ ఓవర్లోనూ రెండు ఫోర్లు, సిక్స్‌తో రెచ్చిపోయాడు. అర్ధ శతకానికి చేరువవుతున్న అతడిని శివాంగ్ బోల్తా కొట్టించడంతో లక్నో రెండో వికెట్ కోల్పోయింది. బదోని (12)ని ఇషాన్ స్టంపౌట్ చేయగా ప్రమాదకర పూరన్ కూడా అతడే రనౌట్ చేయడంతో మ్యాచ్‌లో హైదరాబాద్ పోటీలోకి వచ్చింది.

కానీ అప్పటికే క్రీజులో కుదురుకున్న పంత్.. సమద్ (16) అండగా ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఉనద్కత్ ఓవర్లో రెండు బౌండరీలతో ఫిఫ్టీకి చేరువైన లక్నో సారథి.. హర్ష్ ఓవర్లో ఫోర్‌తో ఈ సీజన్‌తో తన తొలి హాఫ్ సెంచరీని సాధించాడు. అదే ఓవర్లో సమద్ నిష్క్రమించగా మరుసటి ఓవర్లో హర్షల్ నాలుగు పరుగులే ఇవ్వడంతో లక్నో గెలుపు సమీకరణం 6 బంతుల్లో 9గా మారింది. ఈ దశలో ఇరు జట్ల డగౌట్‌లలో ఉత్కంఠ రేగినా ఉనద్కత్ ఆఖరి ఓవర్లో పంత్ మూడు బౌండరీలతో లాంఛనాన్ని పూర్తిచేశాడు.

**సంక్షిప్త స్కోర్లు**

హైదరాబాద్: 20 ఓవర్లకు 156/9 (క్లాసెన్ 62, నితీశ్ 56, షమీ 2/9, ప్రిన్స్ యాదవ్ 2/34)

లక్నో: 19.5 ఓవర్లకు 160/5 (పంత్ 68*, మార్క్మ్ 45, దూబె 2/18, మలింగ 1/30)




# బెంగళూరు జోరు..

ఐపీఎల్ 19లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జోరు కొనసాగు తున్నది. ఆదివారం రాత్రి చిన్నస్వామి స్టేడియంలో భారీ స్కోర్లు నమోదైన మ్యాచ్‌లో బెంగళూరు.. మాజీ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌ను 43 పరుగుల తేడాతో ఓడించి సీజన్‌లో రెండో విజయాన్ని నమో దుచేయగా సీఎస్‌కేకు ఇది హ్యాట్రిక్ ఓటమి కావడం గమనార్హం. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ.. టిమ్ డేవిడ్ (25 బంతుల్లో 70 నాటౌట్, 3 ఫోర్లు, 8 సిక్స్‌లు) ఊచకోతకు తోడు దేవ్‌దత్ పడిక్కల్ (29 బంతుల్లో 50, 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ రజత్ పటీదార్ (19 బంతుల్లో 48 నాటౌట్, 1 ఫోర్, 6 సిక్స్‌లు), ఫిల్ సాల్ట్ (30 బంతుల్లో 46, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) వీరవిహారంతో నిర్ణీత ఓవర్ల లో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 250 పరుగుల రికార్డు స్కోరు చేసింది. కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సీఎస్‌కే.. 19.4 ఓవర్లకు 207 రన్స్ వద్దే ఆగిపోయింది.

టాపార్డర్ విఫలమైనా సర్ఫరాజ్ (50), ప్రశాంత్ (43), ఓవర్టన్ (37) పోరాటంతో ఆ జట్టుకు అవ మానకర ఓటమి నుంచి తప్పించారు. భువనేశ్వర్ (3/41), కృనాల్ (2/36), డఫ్ఫీ (2/58) చెన్నైని కట్టడిచేశారు. భారీ ఛేదనలో సంజూ (9) మరోసారి నిరాశపరచగా గత మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ ఆడిన ఆయుష్ మాత్రె (1), కెప్టెన్ రుతురాజ్ (7) దారుణంగా విఫలమయ్యారు.ఈ మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసిన భువీ.. ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్లు తీసిన తొలి సీమర్‌గా రికార్డులకెక్కాడు.

## ప్రపంచ ర్యాంకింగ్స్‌లో గౌతమ్‌కు 2 స్థానం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 5 : ప్రపంచ పారా తైక్వాండో ర్యాంకింగ్స్‌లో వరంగల్‌కు చెందిన క్రీడాకారుడు ఎల్లావుల గౌతమ్‌యాదవ్ సీనియర్ మెన్ పీ51 విభాగంలో 2వ స్థానం దకించుకున్నారు. ఇప్పటికే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన ఆయన తాజా ర్యాంకింగ్స్‌తో దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి కీర్తి తీసుకొచ్చారు.తెలంగాణ పర్యాటకం వరంగల్ నుంచి ప్రపంచస్థాయి వరకు ఎదిగిన ఆయన ప్రయాణం అనేక పారా క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందని, ఈ విజయంతో రాష్ట్రంలో పారా క్రీడలపై మరింత అవగాహన పెరిగే అవకాశం ఉందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ సందర్భంగా క్రీడాధికారులు, అభిమానులు గౌతమ్ యాదవ్‌ని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పారా ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించి వరంగల్ ఖ్యాతిని చాటుతానని ఈ సందర్భంగా గౌతమ్‌యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు.





## కళ్లతో మాయ చేస్తున్న డింపుల్..

డింపుల్ హయాతి.. ఈ గ్లామర్ బ్యూటీ తన వయ్యారంతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. ఇక తెలుగు, తమిళ్, హిందీ భాషల్లోనూ సినిమాలు చేసింది. కానీ అంతగా సక్సెస్ అందుకోలేకపోయింది. హీరోయిన్ గానే కాదు.. గెస్ట్ రోల్స్ చేసింది. అలాగే స్పెషల్ సాంగ్ కూడా చేసింది.. అయినా స్టార్ డమ్ అందుకోలేకపోయింది. హాట్ బ్యూటీ డింపుల్ హయాతి 2017లో 'గల్ఫ్' సినిమాతో సినీరంగంలోకి వచ్చింది. ఆతర్వాత 2019లో యురేక సినిమాలో నటించింది. అయినా కూడా గుర్తింపు రాలేదు. అదే సమయంలో వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' సినిమాలో 'జర్ర జర్ర ' పాటలో నటించింది. ఈ పాటలో హాట్ లుక్ లో మెరిసి ఆకట్టుకుంది. ఆతర్వాత రవితేజ నటించిన ఖిలాడీ సినిమాలో మరోసారి తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. చివరిగా రామబాణం అనే సినిమాలో కనిపించింది. కానీ ఈ సినిమా కూడా హిట్ అవ్వలేదు. రవితేజ సరసన ఈ చిన్నది భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా కూడా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఇక ఇప్పుడు యంగ్ హీరో శర్వానంద్ తో కలిసి నటిస్తుంది డింపుల్. బోగి అనే టైటిల్ తో తెరకెక్కుతున్న సినిమాలో డింపుల్ హీరోయిన్‌గా ఎంపికైంది. మొన్నామధ్య ఈ సినిమా నుంచి గ్లింప్స్ విడుదల చేశారు. ఈ సినిమా పై డింపుల్ ఆశలు పెట్టుకుంది. ఈ సినిమాతో ఈ ముద్దుగుమ్మ మంచి విజయాన్ని అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు.



## హ్యాపీ బర్త్‌డే జయమ్మ..

### 'రణబాలి' నుంచి రష్మిక మందన్న స్పెషల్

నేడు నేషనల్ క్రష్ రష్మిక మందన్న పుట్టినరోజు సందర్భంగా ఆమె నటిస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ 'రణబాలి' (Ranabaali) నుంచి మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఇప్పటికే మైసా నుంచి కొత్త పోస్టర్ విడుదలై ప్రేక్షకులను అలరిస్తుండగా.. తాజాగా రణబాలి సినిమాలో రష్మిక పోషిస్తున్న 'జయమ్మ' పాత్రకు శుభాకాంక్షలు తెలుపుతూ చిత్ర బృందం ఒక ప్రత్యేకమైన పోస్టర్‌ను విడుదల చేసింది. ఇక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన విషెస్ పోస్టర్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా, టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ పిరియాడిక్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాల తర్వాత విజయ్ దేవరకొండ – రష్మిక మందన్న కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. వీరిద్దరి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ మరోసారి ప్రేక్షకులను అలరించనున్నట్లు టాక్ నడుస్తుంది. 'టాక్సీవాలా', 'శ్యామ్ సింగరాయ్' వంటి విభిన్నమైన చిత్రాలతో మెప్పించిన దర్శకుడు రాహుల్ సాంకృత్యన్.. ఈసారి 'రణబాలి'తో ఒక పవర్‌ఫుల్ పిరియాడిక్ కథను వెండితెరపై చూపించబోతున్నాడు.

## అనధికార కంటెంట్‌పై ఫిర్యాదు చేస్తాం



భారీ పానిండియా చిత్రాలు నిర్మాణంలో ఉన్నప్పుడు హీరోల గెటప్‌ని గోప్యంగా ఉంచడం సహజం. సమయం చూసుకొని మేకర్సే ఆ లుక్‌ని విడుదల చేస్తుంటారు. ఇదంతా ప్రమోషనల్ స్ట్రాటజీ. కానీ మేకర్స్ విడుదల చేయకముందే లొకేషన్‌లో దొంగతనంగా ఫొటోలు తీసి, వాటిని ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ చేయడం నిజంగా నేరమే. 'ఫౌజీ' సినిమా సెట్ నుంచి ప్రభాస్ ఫొటోలను ఇలాగే కొందరు తుంటరులు లీక్ చేశారు. అవి ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో చిత్రబృందం కీలక ప్రకటన విడుదల చేసింది. 'మా సెట్ నుంచి లీకైన కొన్ని ఫొటోలను ఆన్‌లైన్ వేదికగా సర్క్యులేట్ చేస్తున్నారన్న విషయం మా దృష్టికి వచ్చింది. ఓ వెండితెర అద్భుతాన్ని మీకందించేందుకు మేం అహరహం కృషి చేస్తున్నాం. మీ ఎదురు చూపులకు తగిన ఫలితాన్నిస్తాం. కానీ ఈ విధమైన చర్యలు మా పనిపై ప్రభావం చూపిస్తాయి. ఇలాంటి పనులకు తెగబడుతున్నవారికి ఇదే మా హెచ్చరిక. ఈ అనధికార కంటెంట్‌పై ఫిర్యాదు చేస్తాం. తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటాం' అని 'ఫౌజీ' చిత్రబృందం హెచ్చరించింది. 1940ల నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో ఇమాన్వి కథానాయిక. మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్ కీలక పాత్రధారులు. విశాల్ చంద్రశేఖర్ సంగీత దర్శకుడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది.

## 'రాకాస' బాక్సాఫీస్ దూకుడు.. రెండు రోజుల్లోనే 10 కోట్లకు పైగా



ఇటీవల విడుదలైన రాకాస చిత్రం రిలీజ్‌కు ముందే యూత్ ఆడియన్స్‌లో భారీ అంచనాలను క్రియేట్ చేసుకుంది. ఆ క్రేజ్‌కు తగ్గట్టుగానే సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ నమోదు చేస్తూ ట్రేడ్ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'రాకాస' మొదటి రోజున ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.6 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది.

ఈ చిత్రం యూత్ ఆడియన్స్‌లో మంచి హైప్ సృష్టించడంతో మొదటి రోజు నుంచే థియేటర్లలో మంచి ఆక్యుపెన్సీ కనిపించింది. షేర్ పరంగా చూస్తే, ఫస్ట్ డే వరల్డ్‌వైడ్‌గా రూ.2.51 కోట్ల షేర్ నమోదైంది. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచే రూ.1.76 కోట్ల షేర్ రావడం విశేషం. కర్ణాటక మరియు రెస్ట్ ఆఫ్ ఇండియా నుంచి రూ.15 లక్షలు, ఓవర్సీస్ మార్కెట్ నుంచి రూ.60 లక్షల షేర్ వచ్చినట్లు ట్రేడ్ రిపోర్ట్స్ చెబుతున్నాయి.

రెండవ రోజు కూడా 'రాకాస' తన బాక్సాఫీస్ రన్‌ను స్టెడీగా కొనసాగించింది. ప్రపంచవ్యాప్తంగా రెండో రోజు ఈ చిత్రం రూ.10.30 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్‌ను దాటింది. కర్ణాటక: రూ.20 లక్షలు, ఓవర్సీస్: రూ.50 లక్షలు మొత్తం మీద రెండో రోజు వరల్డ్‌వైడ్‌గా రూ.2.30 కోట్ల షేర్ వసూళ్లు నమోదయ్యాయి. రెండు రోజులకు కలిపి మొత్తం రూ.4.80 కోట్ల షేర్ వచ్చినట్లు ట్రేడ్ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ప్రత్యేకంగా ఓవర్సీస్ మార్కెట్‌లో 'రాకాస' మంచి పర్ఫార్మెన్స్ కనబరుస్తోంది. ఇప్పటికే కోటి రూపాయల షేర్ మార్క్‌ను దాటిన ఈ చిత్రం, ఫైనల్‌గా రూ.2 కోట్లలోపే క్లోజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా.

సోషల్ మీడియాలో ఈ సినిమా కలెక్షన్స్‌ను ఉస్తాద్ భగత్ సింగ్ తో పోలుస్తూ చర్చలు జరుగుతున్నాయి. అయితే ఆ చిత్రంతో పోలిస్తే 'రాకాస' ఆ స్థాయిని చేరడం కష్టమని ట్రేడ్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

మూడవ రోజు కూడా ఈ చిత్రం డీసెంట్ హోల్డ్‌ను కొనసాగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. బుక్‌మైషో ట్రెండ్స్ ప్రకారం ప్రతి గంటకు 3 వేలకుపైగా టికెట్లు అమ్ముడవుతున్నాయి. అయితే ఈ సినిమా బ్రేక్ ఈవెన్ సాధించాలంటే రాబోయే రోజుల్లో కూడా ఇదే స్థాయి కలెక్షన్స్ కొనసాగించాల్సి ఉంటుంది. ముఖ్యంగా వీకెండ్ తర్వాత కలెక్షన్స్ ఎలా ఉంటాయన్నదే కీలకం కానుంది. రాకాస చిత్రం యూత్ ఆడియన్స్ సపోర్ట్‌తో బాక్సాఫీస్ వద్ద మంచి రన్ కొనసాగిస్తోంది. మొదటి రెండు రోజుల్లోనే పాజిటివ్ ట్రెండ్ చూపించిన ఈ సినిమా, వచ్చే రోజుల్లో ఎలాంటి కలెక్షన్స్ సాధిస్తుందో చూడాలి.

## 'డెకాయిట్' మెరిసిన ముద్దుగుమ్మ

హిట్ 2 తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న హీరో అడివి శేష్ ఇప్పుడు డెకాయిట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. చిత్ర బృందం ప్రమోషన్లు గట్టిగానే చేస్తోంది. ఈ నేపథ్యంలో డెకాయిల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు మేకర్స్. ఈ వేడుకకు అడివి శేష్, మృణాళ్ ఠాకూర్ తో పాటు చిత్ర బృందమంతా హాజరైంది. అయితే ఈ వేడుకలో ఓ బొద్దుగుమ్మ కూడా తళుక్కుమంది. చక్కని చీరకట్టులో అందరి దృష్టిని ఆకర్షించింది. డెకాయిట్ సినిమాలో ఈ బ్యూటీ కూడా ఒక పవర్ ఫుల్ పాత్రలో నటిస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా ట్రెండ్ అవుతోన్న ఈ బొద్దుగుమ్మ మరెవరో కాదు బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ హీరో ఆమిర్ ఖాన్ మేనకోడలు జేయన్ మేరీ ఖాన్. ప్రముఖ దర్శకుడు మన్సూర్ ఖాన్ కూతురైన ఆమె ఇప్పటికే హిందీ చిత్ర పరిశ్రమలో నటిగా రాణిస్తోంది. ఇప్పుడు డెకాయిట్ సినిమాతో తెలుగు ఆడియెన్స్‌ను పలకరించనుంది. కపూర్ అండ్ సన్స్, సీక్రెట్ సూపర్ స్టార్ సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసింది జేయన్ మేరీ ఖాన్. ఆ తర్వాత నెట్‌ఫ్లిక్స్ రూపొందించిన మిస్ సీరియల్ కిల్లర్ సినిమాతో నటిగా పరిచయమైంది. దీని తర్వాత ఫీల్స్ లైక్ ఇష్క్ వెబ్ సిరీస్‌లోనూ తళుక్కుమందీ అందాల తార. వీటితో పాటు ఓ మై డార్లింగ్, మేడ్ ఇన్ హెవెన్, ఇల్లీగల్: జస్టిస్ అవుట్ ఆఫ్ ఆర్డర్ వంటి సినిమాలు, వెబ్ సిరీసుల్లోనూ వివిధ పాత్రలు పోషించింది జేయన్ మేరీ ఖాన్. బాలీవుడ్ లో నటిగా బిజీ బిజీగా ఉంటోన్న ఆమె ఇప్పుడు డెకాయిట్ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ లో మేరీ ఖాన్‌కు సంబంధించిన స్టిల్స్ బాగా హైలెట్ అయ్యాయి.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**